నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

పునీత్ రాజ్‌కుమార్‌ను రాబోయే తరాలు గుర్తుంచుకుంటాయి : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ అకాల మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే విధి ఆయనను మనకు దూరం చేసిందని, నటనా చాతుర్యం, అద్భుతమైన వ్యక్తిత్వంతో ఆకట్టుకున్న పునీత్ రాజ్‌కుమార్‌ను రాబోయే తరాలు ఎన్నటికీ గుర్తుంచుకుంటాయని అన్నారు.

పునీత్ హఠాన్మరణంగ్రాంతికి గురిచేసిందని ఆయన ట్వీట్ చేశారు. పునీత్ రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రధాని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పునీత్ రాజ్‌కుమార్ తీవ్ర గుండెపోటుతో శుక్రవారం మద్యాహ్నం కన్నుమూశారు.

హైదరాబాద్ శనివారం 30-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 69 పేజీలు:4 వెల: రూ.1/-

కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ కన్నుమూత

బెంగుళూరు, అక్టోబర్ 29:: కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ కన్నుమూశారు. కర్ణాటకలో సూపర్ ఫాలోయింగ్ ఉన్న ఈ హీరో శుక్రవారం ఉదయం జిమ్‌లో వ్యాయామం చేస్తూ కుప్పకూలారు. దీంతో ఆయన్ను హుటాహుటిన బెంగళూరులోని విక్రమ్ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆసుపత్రి వద్దకు అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొని ఆయన కోలుకోవాలని ప్రార్థనలు చేశారు. కానీ ఆ ప్రార్థనలేవీ నెరవేరలేదు.

ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని ఉదయమే ప్రకటించిన ఆసుపత్రి వర్గాలు.. ఆయన మరణించినట్లు తాజాగా ప్రకటించాయి. కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కూడా ఆసుపత్రికి వచ్చి పునీత్ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆ తర్వాత కాసేపటికే ఆయన మరణవార్తను ఆసువత్రి వర్గాలు ప్రకటించాయి. పునీత్ రాజ్ కుమార్ మరణం నేపథ్యంలో కర్ణాటక వ్యాప్తంగా హైఅలర్ట్ విధించారు. సినిమా హాళ్లు ఏవీ తెరవొద్దని ప్రభుత్వం ఆదేశించింది.

కన్నడ లెజెండరీ యాక్టర్ రాజ్ కుమార్ తనయుడుగా శాండల్ వుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన పునీత్ రాజ్ కుమార్ తన టాలెంట్‌తో పవర్ స్టార్ అని పిలిపించుకుంటున్నాడు. పునీత్ మంచి డ్యాన్సర్ కూడా కావడంతో ఆయనకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఆయన అస్వస్థతకు గురయ్యారు.

పునీత్ రాజ్ కుమార్ జిమ్?లో వ్యాయమం చేస్తున్న సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలారు. దీంతో ఆయన్ను బెంగుళూరులోని విక్రమ్ ఆసుపత్రికి తరలించారు. పునీత్ రాజ్ కుమార్ ఆరోగ్యం మరింత విషమించడంతో ఐసీయూలో చికిత్స అందించారు. ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఎన్ని చేసినా ప్రయోజనం లేకపోయింది. 46 ఏళ్ల కన్నడ పవర్ స్టార్ గుండెపోటుతో కన్నుమూసినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి.

పోడు భూములపై రేపు భేటీ కానున్న అఖిల పక్షం

హైదరాబాద్ , అక్టోబర్ 29పోడు భూముల సమస్య పరిష్కారం, అటవీ భూముల రక్షణ అంశాలపై జిల్లా స్థాయిలో అఖిల పక్ష సమావేశాలను నిర్వహించాలని సీయం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు.

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి అఖిల పక్ష నేతలతో పాటు అటవీ, గిరిజన, రెవెన్యూ శాఖల అధికారులు హజరుకానున్నారు. ఇప్పటివరకు పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులు తదితరులకు ఆర్వోఎఫ్ఆర్ హక్కులు కల్పిండంతో పాటు, అడవులు అన్యాక్రాంతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు.

పరిపాలనారంగంలో అతిపెద్ద సంస్కరణ ధరణి: సీఎస్ సోమేశ్ కుమార్

హైదరాబాద్ , అక్టోబర్ 29:తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్ర పరిపాలనారంగంలో వచ్చిన అతిపెద్ద సంస్కరణ ధరణి అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అన్నారు. భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం ధరణి పోర్టల్‌ను ప్రారంభించి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఇవాళ బీఆర్‌కే భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల సీనియర్ కార్యదర్శులు, ఉన్నతాధికారులు, రెవెన్యూ ఉద్యోగసంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ కార్యక్రమం సందర్భంగా ధరణి ఒక ఏడాది కాలంలో సాధించిన విజయాలను తెలిపే ప్రత్యేక బుక్‌లెట్‌ను సీఎస్ సోమేశ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమేశ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలోనే భూ పరిపాలనా రంగంలో విప్లవాత్మకమైన ధరణి పోర్టల్ ఆవిష్కరణ కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు దృఢసంకల్పం వల్లనే సాధ్యమైందన్నారు. ఏడాది కాలంలో ధరణి ఊహించిన దానికంటే విజయవంతమైందని చెప్పారు. పోర్టల్‌ను 5.14 కోట్ల మంది దర్శించడమేగాక, పది లక్షలకుపైగా రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరుగడమే అందుకు నిదర్శనమన్నారు.

కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న పలు విప్లవాత్మక పథకాలవల్ల రాష్ట్రంలో భూముల ధరలు ఒక్కసారిగా నాలుగైదు రెట్లు పెరిగాయని సీఎస్ చెప్పారు. ధరణి పోర్టల్ వల్ల ప్రస్తుతం రికార్డులను తారుమారు చేసే పరిస్థితులు లేవని, రాష్ట్రంలో ఏవిధమైన భూ వివాదాలు తలెత్తడం లేదని సోమేశ్ కుమార్ స్పష్టంచేశారు. గతంలో కేవలం 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్‌లు జరిగాయని, ధరణి ప్రారంభం అనంతరం వీటికి అదనంగా 574 తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించామని గుర్తుచేశారు.

ధరణి విజయవంతంగా కొనసాగడానికి ముందు ఎంతో మంది సీనియర్ అధికారులు వందలాది మంది ఐటీ నిపుణులు శ్రమించిన విషయాన్ని సీఎస్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా ధరణి పోర్టల్ రూపకల్పనలో భాగస్వాములైన అధికారులు తమ అనుభవాలను వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ కమిషనర్ శేషాద్రి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ ఎండీ జీటీ వెంకటేశ్వర్ రావు, పంచాయతీరాజ్ కమిషనర్ ఏ శరత్, సీసీఎల్ఏ ప్రత్యేక అధికారిణి సత్య శారద ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయిపై స్పెషల్ డ్రైవ్: సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ , అక్టోబర్ 29:గంజాయిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ అన్నారు. మాదక ద్రవ్యాలపై ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో ప్రచారం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో 110 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర నేరగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మహేశ్ భగవత్ మీడియాతో మాట్లాడారు. గంజాయిని విశాఖ మన్యం నుంచి నాగ్‌పూర్ తరలిస్తున్నారని చెప్పారు. ప్రధాన నిందితులు లుంబరామ్ సోలంకి, కృష్ణారామ్ అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారయ్యారని చెప్పారు. విశాఖ వాసి పెద్దబాలన్న గంజాయి సరఫరా చేస్తున్నాడని తెలిపారు. అరటిపండ్ల లోడు చాటున గంజాయి తరలిస్తున్నారని వెల్లడించారు.

డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. నయా సవేరా ప్రోగ్రాం ద్వారా, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, అమృత ఫౌండేషన్, మరో లోకం అనే షార్ట్ ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. వారంలో ఒకరోజు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

భవిష్యత్ అంతా విద్యుత్ వాహనాలదే : మంత్రి జగదీష్ రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 29:భవిష్యత్ కాలంలో విద్యుత్ వాహనాల వాడకం తప్పనిసరి అవుతుందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. టీఎస్ రెడ్కో ఆధ్వర్యంలో ఈవీ ట్రేడ్ ఎక్స్‌పో విద్యుత్ వాహనాల ప్రదర్శనను హైటెక్స్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. 10 వేల విద్యుత్ మోటర్ సైకిల్స్ వినియోగంలోకి వచ్చినట్లైతే సంవత్సరానికి 250 కోట్ల రూపాయల పెట్రోల్ దిగుమతులు ఆదా చేసినవారమౌతామన్నారు. ప్రపంచానికి పర్యావరణ కాలుష్యం ఛాలెంజ్ గా మారిన నేపథ్యంలో విద్యుత్ వాహనాల వాడకం తప్పనిసరైందని ఆయన చెప్పారు.

పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ, పరిశ్రమల శాఖ శాఖ మంత్రి కేటీఆర్ విద్యుత్ వాహనాలను ప్రోత్సాహించడంతో పాటు వాహనాలు తయారీ చేస్తున్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యుత్ వాహనాల అమ్మకాలను మాత్రమే కాకుండా ఇక్కడే తయారీ చేసే విదంగా పారిశ్రామిక వేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందన్నారు.

అంతే గాకుండా విద్యుత్ వాహనాలకు అవసరమైన బ్యాటరీ పరిశ్రమలను తెలంగాణలో నెలకొల్పే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన రాయితీలు ఇచ్చి మరీ ఎంకరేజ్ చేస్తుందన్నారు. వాడకంలోకి వచ్చిన విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కు సందేహ పడొద్దని, ఇప్పటికే 138 ఛార్జింగ్ కేంద్రాలను ప్రారంభించినట్లు, మరో 600 ఛార్జింగ్ కేంద్రాల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణా రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉన్నందున ఏ ఒక్కరూ విద్యుత్ వాహనాల ఛార్జింగ్ విషయంలో భయపడొద్దని మంత్రి జగదీష్ రెడ్డి భరోసా ఇచ్చారు.

గోదావరి-కావేరీ నదుల అనుసంధానంపై జలసౌధలో 8 రాష్ట్రాల అధికారుల భేటీ

హైదరాబాద్ , అక్టోబర్ 29: గోదావరి – కావేరి నదుల అనుసంధానం కోసం డీపీఆర్ తయారీ, సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తున్నట్లు ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ తెలిపారు. హిమాలయ బేసిన్లో ఉన్న మిగులు జలాలను దక్షిణానికి తీసుకురావాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. గోదావరి – కావేరి నదుల అనుసంధానంపై హైదరాబాద్‌లో శుక్రవారం నాడు సమావేశం జరిగింది.

జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండోసారి జరిగిన ఈ సంప్రదింపుల భేటీకి భాగ్యనగరంలోని జలసౌధ వేదికైంది. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా గోదావరి – కావేరి లింక్ కోసం డీపీఆర్ రూపొందించామని భోపాల్ సింగ్ తెలిపారు.

అన్ని రాష్ట్రాలకు డీపీఆర్ అందించామని, డీపీఆర్‌పై ఆయా రాష్ట్రాలు కూడా తమతమ అభిప్రాయాలు తెలిపాయని చెప్పారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. మిగులు జలాలు ఉన్న రాష్ట్రాలు కూడా మిగులు లేదని అంటున్నాయని, ఈ విషయంలో పది రాష్ట్రాల అభిప్రాయాల కోసం సమావేశం ఏర్పాటు చేశామని వెల్లడించారు. సానుకూల వాతావరణంలో సమావేశం జరిగిందని తెలిపారు.

కృష్ణా, పెన్నా, కావేరి బేసిన్‌లో ఉన్న నీటి లోటును తీర్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. పది లక్షల హెక్టార్లకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళికలు వేస్తున్నామని, 87000 కోట్ల అంచనా వ్యయంతో ఈ అనుసంధాన ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు, వివరాలను నెల రోజుల్లోపు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు.

ఈ అభిప్రాయ సేకరణ తర్వాత ఆ తదుపరి ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నీటి లభ్యతకు సంబంధించి కేంద్ర జలసంఘం ద్వారా ఖచ్చితమైన అధ్యయనం జరగాలని తెలంగాణ కోరగా.. తమ వాటాకు భంగం కలగకుండా చూడాలని ఏపీ డిమాండ్ చేసింది.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మహేష్ బిగాల

హైదరాబాద్ , అక్టోబర్ 29: సీఎం కేసీఆర్ మంచి విజన్‌తో పారదర్శకమైన రెవెన్యూ వ్యవస్థను, రికార్డులను తయారు చేసేందుకు ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని టీఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేష్ బిగాల అన్నారు. తెలంగాణ రాకముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేది.

దీంతో ఘర్షణలు, వివాదాలు తలెత్తేవి. ఈ అనర్థాలను రూపుమాపేందుకు, ప్రతి గుంటకు యజమాని ఎవరో తెలిసేందుకు భూరికార్డుల ప్రక్షాళన, కొత్త రెవెన్యూచట్టం, ధరణి పోర్టల్.. ఇలా ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది.

వాటి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు.

ఆధార్ కార్డు లేని ఎన్నారైలకు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు, పాస్ పోర్టు ద్వారా ధరణిలో లావాదేవీలకు అవకాశం కల్పించడంతో ఎంతో మంది ఎన్నారైలు దాన్ని సద్వినియోగపరుచుకున్నారని తెలిపారు. ధరణి ఏర్పడి విజయవంగా సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నారైల తరఫున మహేష్ బిగాల సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

31న విశాఖలో సభ ఏర్పాట్లు.. పోలీసులతో జనసేనకు టెన్షన్

అమరావతి, అక్టోబర్ 29:। విశాఖ స్టీల్‌ను ప్రయివేటీకరించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 31న విశాఖలో బహిరంగసభ నిర్వహించాలని పవర్ స్టార్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయించారు. అయితే, సభా వేదిక ఏర్పాటుపై పోలీసులతో జనసేన నాయకులకు వివాదం ఏర్పడింది. కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద సభ నిర్వహణకు జనసేన నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసులు సభా వేదికను మార్చాలని జనసేన నాయకులకు సూచించారు.. జనసేన నాయకులు మాత్రం ససేమిరా అంటున్నారు. ఆరునూరైనా ఇక్కడే సభ జరుపుతామంటూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ తరుణంలో పవన్‌కల్యాణ్ సభ జరుగుతుందా.. లేదా.. అన్న సందే హాలు వ్యక్తం అవుతున్నాయి. పవన్ కల్యాణ్ సారధ్యంలోని జనసేన.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మిత్రపక్షంగా ఉన్న సంగతి తెలిసిందే. కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్‌కు మిత్రపక్షంగా ఉన్నా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సభ జరుపాలని పవన్ కల్యాణ్ నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆహ్వానం మేరకు ఆదివారం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వెళ్లి కార్మికులతో ముచ్చటిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సభలో పవన్ కల్యాణ్ పాల్గొంటారు. ఇప్పటికే విశాఖ ఉక్కు.. ఆంధ్రుల భావోద్వేగంతో ముడిపడి ఉన్న ఫ్యాక్టరీ అని.. దీన్ని ప్రైవేటీకరించొద్దని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను గత ఫిబ్రవరిలో కలిసి పవన్ కల్యాణ్ కోరారు.

ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ మరో 3 ఏండ్లు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పట్ల కేంద్ర ప్రభుత్వం విశ్వాసం ప్రకటించింది. మరో మూడేండ్ల పాటు ఆయన ఆ పదవీకాలం పొడిగింపునిచ్చారు. అంటే 2024 డిసెంబర్ వరకు ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ కొనసాగుతారు. 1980వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శక్తికాంత దాస్.. 2018 డిసెంబర్ 12న ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కేంద్రం శక్తికాంత దాస్‌ను నియమించింది. ఈ ఏడాది డిసెంబర్ 10తో ఆయన పదవీ కాలం ముగియనున్నది.గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రధాని మోదీ సారధ్యంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ శక్తికాంత దాస్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నది. కరోనా మహమ్మారి వేళ వివిధ పరిశ్రమలు మూతపడి.. ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతినడంతో వ్యవస్థలో ద్రవ్య లభ్యత సంక్షోభం ముందుకొచ్చింది. ఈ సమస్య పరిష్కారానికి ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ రంగంలోకి దిగారు. ద్రవ్యపరపతి విధానంలో వడ్డీరేట్లు తగ్గించారు. ప్రస్తుతం వివిధ రుణాలపై వడ్డీరేట్లు 6.44 శాతం నుంచి ప్రారంభం అవుతుండగా, డిపాజిట్లపై 5 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. దీంతో దేశీయంగా ఇండ్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఉద్దీపన ప్యాకేజీలతోపాటు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పూనుకున్నారు. ప్రత్యేకించి ఆరు నెలల పాటు రుణ బకాయిల వసూళ్లపై మారటోరియం విధించడంతో సత్ఫలితాలొచ్చాయి. కష్టాల్లో చిక్కుకున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలిచ్చారు. మరోవైపు కేంద్రంతో సమన్వయం చేసుకున్నారు. కరోనా రెండో వేవ్ తర్వాత ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతున్నది. ఈ తరుణంలో ఎకానమికి మరింత బూస్టినిచ్చేందుకు శక్తికాంత దాస్ వ్యూహాలు అవసరం అని కేంద్రం భావించినట్లు తెలుస్తున్నది.

38 ఏండ్ల కెరీర్‌లో పలు కీలక బాధ్యతలు

1980వ బ్యాచ్ తమిళనాడు క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శక్తికాంత దాస్.. 2017 వరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శిగా పని చేశారు. 2016లో నోట్ల రద్దు టైంలో కేంద్రంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ఆర్థికశాఖలో పని చేస్తున్నప్పుడు 8 బడ్జెట్ల రూపకల్పనలో భాగస్వామి అయ్యారు. ఆర్థికం, పన్నులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

జంట హత్య కేసులో నిందితుల అరెస్ట్-జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ రాజేశ్ చంద్ర

ఆదిలాబాద:, అక్టోబర్ 29: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామంలో ఉర్సు ఉత్సవాల్లో ఒకే సామాజిక వర్గం మధ్య తలెత్తిన ఘర్షణలో ఇద్దరు మృతికి కారణమైన 12 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ రాజేశ్ చంద్ర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుండాల గ్రామంలో ఎంపీటీసీ భర్త ముబిన్, సర్పంచ్ భర్త అబ్దుల్ రషీద్‌ల మధ్య గత కొన్నేళ్లుగా రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయి.

27న గ్రామంలో ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తామని అబ్దుల్ రషీద్ వర్గం అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా పోలీసులు నిరాకరించారు. ఉల్లంఘనలను అతిక్రమించి సర్పంచ్ వర్గం డీజే సిస్టమ్, ర్యాలీ నిర్వహించగా ఎంపీటీసీ వర్గం వారు అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది.

ఈ ఘర్షణలో అన్నదమ్ములైన షేక్ జైరొద్దీన్ (60) షేక్ హ (55) అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. షేక్ సిరాజ్ తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. దాడులకు పాల్పడిన నిందితులు అబ్దుల్ రషీద్, షేక్ ఆస్లామ్, షేక్ అస్గర్, షేక్ షఫత్, షేక్ సద్దామ్, షేక్ రబ్బన్, షేక్ జుమ్మా, షేక్ మూస, షేక్ హషమ్, షేక్ హామిద్, షేక్ అల్లాఉద్దీన్, షేక్ జలీల్ ఒప్పుకున్నారని పేర్కొన్నారు. వీరిని బోధ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు వివరించారు.

మిగతా నిందుల కోసం హైదరాబాద్, మహారాష్ట్ర, ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను రప్పించి గాలి ంపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దాడు లకు పాల్పడి, పారిపోయిన నిందితులు స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోవా లన్నారు.ప్రస్తుతం గుండాల గ్రామం పూర్తిగా పోలీసుల ఆధీనంలో ఉందన్నారు. అయిదుగురు సీఐల ఆధ్వర్యంలో రెండు వందల మంది పోలీసుల బలగాలతో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

'ధరణి'కి ఏడాది పూర్తి.. సీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్: రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ధరణి పోర్టల్‌ను ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి పలువురు ప్రభుత్వ కార్యదర్శులు, వివిధ శాఖల సీనియర్ అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. అనంతరం ధరణి ఏడాది పీరియడ్‌కు సంబంధించి రూపొందించిన పుస్తకాన్ని సీఎస్ సోమేశ్ కుమార్ ఆవిష్కరించారు.

చరిత్రలో నేటినిజం



తే॥ ఇమ్మహిం బాలు మునులకు భి
న్నమ్మన్న ఆపమూచ పంచు నయనుగమిళిగా
ముమ్మడి పరమున నలుచిన
దుమ్మను జూచి - బాలయోగి నారాధింతున్!!

(అక్టోబర్ 30 ముమ్మడివరం బాలయోగి జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

భారత రక్షణశాఖలో చేరిన ప్రతిష్టాత్మక అగ్ని-5 క్షిపణి

(అగ్ని-5 క్షిపణి ప్రయోగం విజయవంతం అయిన సంతోషంలో..)

గత రెండేళ్లుగా లడక్ సరిహద్దు ప్రాంతాల్లో చైనా చొరబాటు ప్రయత్నాలకు ధీటైన సమాధానం ఇస్తున్న భారత సాయుధ బలగాల అమ్ములపొదిలో డిఆర్‌డిఓ రూపొందిందించిన 'అగ్ని-5 క్షిపణి' చేరడం హర్షదాయకం. ఇటీవల 'అగ్ని-5 క్షిపణి' ప్రయోగం విజయవంతం కావడం భారతీయులకు గర్వకారణంగా నిలుస్తున్నది. 17-మీటర్ల ఎత్తు కలిగిన అగ్ని-5 మెసైల్‌లో 3-అంచెల ఘన ఇంధన ఇంజన్‌ను వినియోగించారు. అత్యంత ఖచ్చితత్వంతో 5000 కిమీ దూరాన ఉన్న లక్ష్యాన్ని ఛేదించగల తొలి 'ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మెసైల్'గా రాత్రి పూట ప్రయోగించిన అగ్ని-5 క్షిపణి మన రక్షక బలగాలకు మరింత బలాన్ని చేతూర్చినట్లు అయ్యింది. 50 టన్నుల బరువుగల అగ్ని-5 క్షిపణిని ఒరిస్సాలోని 'ఏపిజె అబ్దుల్ కలాం ఐలాండ్' నుంచి బుధవారం (27 అగష్టు '21) రాత్రి 7:50 గంటలకు ప్రయోగించారు. ధ్వని కన్న 24 రెట్లు అధిక వేగంగా ప్రయాణం చేయగల 'లాంగ్ రేంజ్ సర్ఫేస్-టు-సర్ఫేస్ బాలిస్టిక్ అగ్ని-5 క్షిపణి'తో రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్, టెలిమెట్రీ స్టేషన్లు అనుసంధానం కావడంతో 5000-8000 కిమీ దూరాన బంగాళాఖాతంలో ఉన్న లక్ష్యాన్ని ఖచ్చితత్వంతో ఛేదించగలగడం హర్షదాయకం. భారత ప్రభుత్వ పాలసీ ప్రకారం 'ఇంక్రెడిబుల్ మినిమమ్ డిటెరెన్స్ (అపురూప కనిష్ట నిరోధం)'తో 'నో ఫస్ట్ యూజ్' సంకల్పంతో అగ్ని-5ను డిఆర్‌డిఓ ప్రయోగించింది.

ప్రతిష్టాత్మక రక్షణ శాఖకు చెందిన పరిశోధనా సంస్థ డిఆర్‌డిఓ రాబోయే కాలంలో అత్యంత ఆధునిక '6-న్యూక్లియర్ వార్‌హెడ్స్'గల అగ్ని 'మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికిల్'ను కూడా ప్రయోగించనున్నది. ఇండియాలోని ఏ నగరానైనా ఛేదించగల (12,000-15,000 కిమీ) 'డాంగ్ ఫెంగ్ 41' క్షిపణిని చైనా కలిగి ఉందని మనకు తెలుసు. ఇలాంటి మరి కొన్ని మెసైల్స్‌ను రూపొందిస్తున్న చైనా దూకుడుకు అగ్ని-5 ముక్కుతాడు వేయగలదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 'స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి సంస్థ' అంచనాల ప్రకారం చైనా చేతులో 350, పాకిస్థాన్ వద్ద 165, ఇండియా అమ్ములపొదిలో 156 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నాయని తెలుస్తున్నది. ఇండియా త్రివిధ దళాల్లో 1,500 కిమీ దూరాన్ని ఛేదించగల 'అగ్ని-ప్రైమ్', అగ్ని-1 (700 కిమీ), పృథ్వీ-2 (350 కిమీ), అగ్ని-2 (2,000 కిమీ), అగ్ని-3 (3,000 కిమీ), అగ్ని-4 (3,500 కిమీ) క్షిపణి ప్రయోగాలను చేయడం మనం సగర్వంగా చూశాం. భారత అమ్ములపొదిలో సుఖోయ్-30యంకెఐ, మిరేజ్-2000, జాగ్వార్ ఫైటర్లు, రాఫెల్ ఫైటర్లు లాంటివి ఉండడం మన రక్షణ బలగాలను బలోపేతం చేస్తున్నాయి. అమెరికా, రష్యా, చైనా దేశాలు 5000 కిమీ క్షిపణిలను కలిగి ఉన్నాయి. 3,500-4,000 కిమీ లక్ష్యాన్ని ఛేదించగల కె-4 క్షిపణి ప్రయోగాన్ని త్వరలో చేయనుంది. 2012లో ప్రారంభమైన అగ్ని క్షిపణి ప్రయోగాలు క్రమంగా పెరుగుతూ 5,000 కిమీ సామర్థ్యం కలిగిన అగ్ని-5 మెసైల్ ప్రయోగం వరకు రావడం సంతోషదాయకం. రాబోయే రోజుల్లో 10,000-15,000 కిమీ లక్ష్యాన్ని ఛేదించగల క్షిపణి ప్రయోగాలు కూడా విజయవంతంగా చేసి చైనాకు ధీటుగా నిలవాలని కోరుకుందాం. అగ్ని-5ను రూపొందించి, ప్రయోగించిన డిఆర్‌డిఓ బృందాన్ని మనసారా అభినందిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

వైద్యం కోసం వెళితే గెటవుట్.. ప్రభుత్వ వైద్యశాలలో ఎంపీపీకి అవమానం

వరంగల్, అక్టోబర్ 29: ములుగు జిల్లా వాజేడు మండల ఎంపిపి శ్యామల శారదకు వాజేడు ప్రభుత్వ వైద్యశాలలో అవమానం ఎదురైంది. గత కొద్ది రోజులుగా జ్వరం రావడంతో అనారోగ్యానికి గురైన ఎంపీపీ శ్యామల శారద శుక్రవారం ఉదయం వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడి వైద్యాధికారి సౌర్య.. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యూలో నిలబడి ఒక రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా పక్కనే ఉన్న కుర్చీలో ఎంపీపీ శ్యామల శారద కూర్చుండగా ఆగ్రహానికి గురైన వైద్యాధికారి సౌర్య.. ఎంపీపీ శ్యామల శారద బయటికి వెళ్లాలని సూచించారు. ఆరోగ్యం బాగోలేక వైద్య పరీక్షల నిమిత్తం వచ్చానని ఎంపిపిని చెప్పినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. "ఎంపీపీ అయితే ఏంటి ముందు బయటికి వెళ్ళండి గెటవుట్" అంటూ ఘాటుగా సమాధానమిచ్చారు. దీంతో అవమానానికి గురైన ఎంపిపి శ్యామల శారద అసహనం వ్యక్తం చేస్తూ తోటి ప్రజాప్రతినిధురాలైన వాజేడు జెడ్పిటిసి తల్లిడి పుష్పలతకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

జడ్పిటిసి వైద్యశాలకు వెళ్లి వైద్యాధికారి సౌర్య పై మండిపడ్డారు. ప్రజాప్రతినిధులను గౌరవించడం తెలియదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు అయితే బయటికి వెళ్ళమంటే తప్పేముందని వైద్యాధికారి మొండిగా సమాధానం ఇవ్వడంతో.. మహిళా ప్రజాప్రతినిధులు అవమానానికి గురయ్యారు. వైద్యాధికారి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీకి చెందిన వాజేడు మండల ఎంపీపీకే ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది అంటే సామాన్య రోగుల పరిస్థితి ఏంటి? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోగుల పట్ల ఆప్యాయత అనురాగాలతో మెలగాల్సిన ప్రభుత్వ వైద్య అధికారులు నిర్లక్ష్యం సమాధానంతో వ్యవహరించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వ్యవహార శైలితో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ సేవలు అభాసుపాలు కాక తప్పడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి నిర్లక్ష్యపు వైద్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం విడుదల.. తెలుగు రాష్ట్రాలకు ఎంతంటే..

హైదరాబాద్ , అక్టోబర్ 29:జీఎస్టీ పరిహారం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రూ. 44వేల కోట్లు విడుదల చేసింది. కొవిడ్ కారణంగా ఏర్పడిన పన్ను నష్టం భర్తీ కోసం బహిరంగ మార్కెట్ నుంచి సేకరించిన రుణాలను యథాతథంగా రాష్ట్రాలకు పరిహారం రూపంలో చెల్లించినట్లు కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.905.59 కోట్లు, తెలంగాణకు రూ.1,264.78 కోట్లు ఇచ్చినట్లు తెలిపింది. దీంతో 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం రూ.1.59 లక్షల కోట్ల బకాయిలను పూర్తిగా చెల్లించినట్టైందని పేర్కొంది. ఇందులో ఏపీకి రూ.3,272.19 కోట్లు, తెలంగాణకు రూ.4,569.49 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించింది. ఆదాయనష్ట భర్తీ కోసం జులై 15న రూ.75వేల కోట్లు, అక్టోబరు 7న రూ.40వేల కోట్లు, ఇప్పుడు రూ.44వేల కోట్లు విడుదల చేసినట్లు గుర్తుచేసింది. సెస్ వసూలు ద్వారా వచ్చే మొత్తం నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు మరో రూ.లక్ష కోట్లు పరిహారం కింద అందించనున్నట్లు తెలిపింది. దీంతో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం కింద మొత్తం రూ.2.59 లక్షల కోట్లు దక్కుతుందని పేర్కొంది. ఇప్పుడు విడుదల చేసిన రూ.44వేల కోట్లను 5 ఏళ్ల కాలానికి సెక్యూరిటీల విక్రయం ద్వారా 5.69% సగటు వడ్డీతో రుణంగా సేకరించినట్లు వివరించింది

తెలంగాణ సర్కార్‌కు షాక్.. పాలమూరు-రంగారెడ్డి పథకానికి బ్రేక్!

హైదరాబాద్ , అక్టోబర్ 29: కృష్ణా నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేయవద్దని చెన్నై గ్రీన్ ట్రైబ్యునల్ స్టే విధించింది. ఏపీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఔటు ఈ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన వివరణతో ఎన్జీటీ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది.

కాగా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కరివెన వద్ద నిర్మిస్తున్నారు. దీనికి 2015, జూన్ 11న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణానది నుంచి 70 టీఎంసీల వరద నీటిని ఎత్తిపోయడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉంది? ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 7 లక్షల ఎకరాలకు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2.7 లక్షల ఎకరాలకు, నల్లగొండ జిల్లాలో 0.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రణాళికగా ఉంది. హైదరాబాద్ కు తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో తాగునీరు, సాగునీరు అందించే లక్ష్యాలతో ఈ ప్రాజెక్టును చేపట్టింది. అయితే, పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుపై ఏపీ అభ్యంతరం చెబుతూ వస్తోంది. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్.. ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని ఆదేశించింది. కేంద్ర అటవీశాఖ అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేసింది. దీంతో తెలంగాణ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగినట్టు అయ్యింది.

సదరన్ క్యాంపులో 44 మందికి ఆరోగ్య పరీక్షలు..

జనగామ, అక్టోబర్ 29: జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంప్ ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్ లో 44 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పి. సుగునాకర్ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదరం క్యాంపులో పాల్గొనేందుకు 50మంది వికలాంగులు..మీ సేవ లో దరఖాస్తు చేసుకున్నారు. కానీ 44 మంది మాత్రమే హాజరు అయ్యారని తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి వైద్యులు ప్రదీప్ కుమార్,విజయ రాజ్,డి అర్ డి ఎ కార్యాలయ సిబ్బంది వినిత, రమేష్,కవిత, అనిత, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సహాధ్యక్షతలో 18వ భారత-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:ఆసియాన్ కు ప్రస్తుతం అధ్యక్ష స్థానంలో ఉన్న బ్రూనై సుల్తాన్ హాజీ హసనాల్ బోల్కియా ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గురువారం 18వ భారత-ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. వర్చువల్ గా జరిగిన ఈ శిఖరాగ్ర సదస్సులో ఆసియాన్ సభ్య దేశాల నాయకులు పాల్గొన్నారు.

భారత-ఆసియాన్ భాగస్వామ్యం 30వ వార్షికోత్సవ వైలురాయిని చేరిన సందర్భంగా 2022 సంవత్సరాన్ని భారత-ఆసియాన్ సంవత్సరంగా పాటించనున్నట్టు నాయకులు ప్రకటించారు. భారతదేశం అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండియా-పసిఫిక్ విస్తృత భాగస్వామ్య విజన్ రెండింటిలోనూ ఆసియాన్ కేంద్రంగా ఉన్నదని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. ఆసియాన్ ఇండో-పసిఫిక్ దృక్కోణం (ఎఓఐపి), భారత ఇండో-పసిఫిక్ సముద్ర చొరవ (ఐపిఓఐ) రెండింటి శక్తిని మరింత పటిష్టం చేస్తూ ప్రాంతీయ శాంతి, సుస్థిరత, సుసంపన్నతల కోసం సహకారం పేరిట రూపొందించిన భారత-ఆసియాన్ ఉమ్మడి ప్రకటనను ప్రధానమంత్రి, ఆసియాన్ నాయకులు ఆహ్వానించారు.

ప్రాంతీయంగా కోవిడ్-19 మహమ్మారిపై భారతదేశం సాగిస్తున్న పోరాటాన్ని ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఈ విషయంలో ఆసియాన్ చొరవలకు మద్దతు అందిస్తామని పునరుద్ఘాటించారు. మయన్మార్ లో ఆసియాన్ చేపట్టిన మానవతాపూర్వక సహాయ కార్యక్రమాల కింద వైద్య సరఫరాల కోసం రెండు లక్షల డాలర్లు, ఆసియాన్ కోవిడ్-19 రెస్పాన్స్ ఫండ్ కు 10 లక్షల డాలర్లు భారతదేశం అందించిందని ఆయన చెప్పారు.

భారత-ఆసియాన్ దేశాల మధ్య భౌతిక, డిజిటల్, ప్రజా అనుసంధానతను మరింత విస్తృతంగా విస్తరించేందుకు గల అవకాశాలపై నాయకులు అభిప్రాయాలు తెలియచేసుకున్నారు. భారత-ఆసియాన్ సాంస్కృతిక అనుసంధానత బలోపేతం చేయడానికి వీలుగా ఆసియాన్ సాంస్కృతిక వారసత్వ జాబితా రూపకల్పనకు భారతదేశం మద్దతు అందిస్తుందని ప్రధానమంత్రి ప్రకటించారు. వాణిజ్యం, పెట్టుబడుల కోణాన్ని పరిశీలిస్తే కోవిడ్ అనంతర ఆర్థిక రికవరీలో సరఫరా వ్యవస్థల విస్తరణ, పటిష్ఠతకు ప్రాధాన్యం ఉన్నదంటూ ఈ దిశగా భారత-ఆసియాన్ ఎఫ్ టిఏను పునర్ నవీకరించవలసిన ఉన్నదని ప్రధానమంత్రి చెప్పారు.

ప్రాంతీయంగా విశ్వసనీయ భాగస్వామిగాను, ప్రత్యేకించి ప్రస్తుత కోవిడ్-19 మహమ్మారి కాలంలో వ్యాక్సిన్ సరఫరాల ద్వారా అందిస్తున్న భారతదేశం పోషిస్తున్న పాత్రను, సహకారాన్ని ఆసియాన్ నాయకులు ప్రశంసించారు. అలాగే ఇండో-పసిఫిక్ సహకార భాగస్వామ్యంలో ఆసియాన్ కేంద్ర స్థానంగా నిలవడానికి భారతదేశం అందిస్తున్న మద్దతును వారు ఆహ్వానించారు. ఉమ్మడి ప్రకటన ద్వారా భారత-ఆసియాన్ సహకారం మరింత విస్తరించుకోవడానికి తాము ఎదురు చూస్తున్నట్టు తెలిపారు.

దక్షిణ చైనా సాగరం, ఉగ్రవాదం సహా అందరికీ ఆసక్తి, ఆందోళన గల ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై కూడా నాయకులు చర్చించారు. అంతర్జాతీయ చట్టాలు ప్రత్యేకించి యుఎన్ సిఎల్ఓఎస్ పరిధిలో అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడుతూ నిబంధనల ఆధారిత వ్యవస్థను ప్రోత్సహించవలసిన ప్రాధాన్యతను నాయకులు గుర్తించారు. దక్షిణ చైనా సముద్రంలో శాంతి, సుస్థిరత, భద్రత, సెక్యూరిటీ నిర్వహణ, ప్రోత్సాహం ప్రాధాన్యతను నాయకులు పునరుద్ఘాటిస్తూ సాగర జలాల్లో నౌకల రవాణాకు, సముద్ర జలాల మీదుగా గగనతలంలో విమానాల రాకపోకలకు స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయపడ్డారు. భారత, ఆసియాన్ దేశాల మధ్య లోతైన, బలీయమైన, బహుముఖీన సంబంధాలున్నాయంటూ ఇందుకు సంబంధించిన పలు అంశాలను అత్యున్నత స్థాయిలోసమీక్షించి, భారత-ఆసియాన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త దిశ కల్పించేందుకు 18వ భారత-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు చక్కని అవకాశంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

సీఐఐ ఆసియా హెల్త్ 2021 సదస్సు ప్రారంభ సమావేశంలో ప్రసంగించిన డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: సీఐఐ ఆసియా హెల్త్ 2021 సదస్సు ప్రారంభ సమావేశంలో ఈ రోజు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవీయ పాల్గొని ప్రసంగించారు. 'మెరుగైన రేపటి కోసం ఆరోగ్య సంరక్షణ రంగంలో మార్పులు ' అనే అంశంతో సీఐఐ ఈ సదస్సును నిర్వహిస్తోంది.

సదస్సులో ప్రసంగించిన శ్రీ మాండవీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టితో తీసుకున్న నిర్ణయంతో దేశాభివృద్ధితో అంతర్భాగంగా ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. గతంలో దేశ అభివృద్ధితో సంబంధం లేకుండా కేవలం చికిత్స కోసం మాత్రమే వైద్య రంగం పరిమితం అయ్యిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం దేశాభివృద్ధితో ముడిపెట్టి ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. దీనివల్ల ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని శ్రీ మాండవీయ వివరించారు. వ్యాధుల నివారణకు ఆరోగ్య రంగంలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణ లక్ష్య సాధనలో ఖేలో ఇండియా, యోగ లాంటి అంశాలు కీలకం గా ఉంటాయని ఆయన అన్నారు.

పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఆరోగ్య రంగ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకుని రావాలన్న లక్ష్యంతో కేంద్రం పనిచేస్తున్నదని శ్రీ మాండవీయ అన్నారు. లక్ష్య సాధనకు అవసరమైన చర్యలను అమలు చేస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన (ఆరోగ్య బీమా పథకం), ఆయుష్మాన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు, జనరిక్ ఔషధాల కోసం ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన , ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్,పీఎం ఆయుష్మాన్ వంటి అనేక పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు.

సాధారణ ఆరోగ్యం నుంచి సంపూర్ణ ఆరోగ్యం అంశానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ప్రభుత్వం ఆరోగ్య పథకాలకు ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి అన్నారు. దీనిలో భాగంగా ఆరోగ్య రంగంలో మౌలిక సౌకర్యాలను కల్పించడానికి 2021 అక్టోబర్ 25 వ తేదీన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించారని శ్రీ మాండవీయ వివరించారు. దీనివల్ల దేశంలో ఆరోగ్య రంగంలో సౌకర్యాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు.

సాంకేతికతను ఆరోగ్య రంగానికి జోడించి ఆరోగ్య సేవలను అందించడానికి చర్యలు అమలు చేయక తప్పదని మంత్రి స్పష్టం చేశారు. అత్యంత ఆధునిక నానో, రోబోటిక్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆరోగ్య రంగంలో విస్తృతంగా వినియోగించాలని ఆయన సూచించారు. ఆరోగ్య ప్రమాణాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంలో భాగంగా దేశంలో ఆయుష్మాన్ డిజిటల్ మిషన్ అమలు జరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు.

ఆరోగ్య రంగంలో అవగాహన అనేది కీలక అంశంగా ఉంటుందని శ్రీ మాండవీయ అన్నారు. కోవిడ్-19 సమయంలో ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం అమలు చేసిన అవగాహనా కార్యక్రమాలు సాధించిన విజయాలు దీనికి నిదర్శనం అని మంత్రి అన్నారు. 'దవాయి భీ కడ్డె భీ' మరియు 'దో గజ్ కి దూరి, మాస్క్ హై జరూరి' వంటి అవగాహనా కార్యక్రమాలు ప్రజలను చైతన్యవంతులను చేసి దేశంలో కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టడంలో ఉపయోగ పడ్డాయని అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా క్షయవ్యాధి (టీబీ), ఎయిడ్స్ లాంటి వ్యాధుల నిర్మూలనలో అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

దేశ ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెట్టాలని శ్రీ మాండవీయ పెట్టుబడిదారులు విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు దేశ ఆరోగ్య రంగం అద్భుత అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. అంతర్జాతీయ ఆరోగ్య పర్యాటక హబ్ గా దేశం అభివృద్ధి సాధిస్తుందని అన్న శ్రీ మాండవీయ ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రైవేట్ రంగానికి సూచించారు. ' ఆరోగ్యవంతమైన సంపద దేశం'గా దేశాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలకు ప్రతి ఒక్కరూ తమ సహాయ సహకారాలను అందించాలని మంత్రి కోరారు.

కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వినోద్ కే పాల్, నేషనల్ హెల్త్ అథారిటీ సీఈఓ డాక్టర్ ఆర్.ఎస్.శర్మ, సీఐఐ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్య నియంత్రకై స్పెషల్ డ్రైవ్..

వరంగల్, అక్టోబర్ 29:రణ గొన ధ్వనులతో వరంగల్ మహా నగరంలో శబ్ద కాలుష్యానికి కారణమవుతోన్న ద్విచక్ర వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు విశ్వరూపం చూపారు. ఎన్ని సార్లు హెచ్చరించిన తీరు మార్చుకొని వాహనదారులకు ఊహించని షాక్ నిచ్చారు. స్పెషల్ డ్రైవ్ ను చేపట్టి, అధిక మొత్తంలో సౌండ్ పొల్యూషన్ చేస్తున్న సైలెన్సర్ లను వెహికిల్స్ నుండి తొలగించారు. అనంతరం రోడ్డు రోలర్స్ కింద వేసి ధ్వంసం చేశారు. వరంగల్ ట్రాఫిక్ పోలీసులు ఎంతో సహనంతో టూ వీలర్ వెహికిల్స్ ఓనర్లకు చెప్పినా పెడచెవిన పెట్టడంతో సీరియస్ గా తీసుకొన్నారు. రెగ్యులర్ చెకప్స్ సమయంలో సౌండ్ పొల్యూషన్ కలిగిస్తున్న సైలెన్సర్స్ ను తొలగించాలని ఇచ్చిన వార్నింగ్ ని లైట్ గా తీసుకుంటున్నారు. దాంతో ట్రాఫిక్ పోలీసులు డోస్ పెంచారు. హైదరాబాద్ లో పోలీస్ కమిషనర్ ఆచరించిన పద్ధతులు, విధానాలను వరంగల్ లో అమలు పరచి, వాహనదారులకు షాక్ ఇచ్చారు. వరంగల్లోని తెలంగాణ జంక్షన్ వద్ద ఈ నెలలో పట్టుకున్న 30 అధిక మొత్తంలో సౌండ్ పొల్యూషన్ చేస్తున్న సైలెన్సర్ లను రోడ్డు రోలర్ కింద వేసి, ధ్వంసం చేశారు. మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం కంపెనీ నుండి వచ్చిన సైలెన్సర్స్ ను తొలగించి, అధిక శబ్దం చేసే సైలెన్సర్స్ ను వెహికిల్స్ కు అమర్చుకొని, నగరంలో సౌండ్ పొల్యూషన్ సృష్టించడమే కాక, ప్రజలకు అసౌకర్యం, ఇబ్బంది కలిగించే వాహనాల భరతం పట్టే సత్కార్యానికి వరంగల్ ట్రాఫిక్ పోలీసులు శ్రీకారం చుట్టారు.

అధిక శబ్దాలు చేస్తూ, పేషంట్స్ ప్రాణాలతో చేలాగాటమాడటం కూడ నేరంగానే పరిగణిస్తారు. ప్రజల యొక్క స్థితిగతులను అర్థం చేసుకోకుండా హై సౌండ్స్ వచ్చే సైలెన్సర్స్ ఏర్పాటు చేసుకోవడం, కొందరైతే కంపెనీ నుండి వచ్చిన వాహనాల సైలెన్సర్స్ మఫలర్స్ తొలగించి,భీకరమైన శబ్దాలతో నగరంలో హాల్ చల్ చేస్తున్న వాహణదారులపై కొరడా ఝుళిపించారు. సౌండ్ పొల్యూషన్ తో వాతావరణ ,శబ్ద కాలుష్యానికి కారణమవడమే కాక,నగర వాసులు అసౌకర్యం,ఇబ్బందులు గురి చేస్తుండటంతో వరంగల్ ట్రాఫిక్ పోలీసులు సీరియస్ గా తీసుకొని ,హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో అమలు పరిచిన పద్ధతిని వరంగల్ లో అమలు పరిచారు.

భవిష్యత్తులో శబ్ద కాలుష్యంకు అవకాశం లేకుండా చేయడం కోసమే భారీ శబ్దాలు చేసే సైలెన్సర్స్ ను ధ్వంసం చేసి, షాకిచ్చారు.ఇక నుండి రెగ్యులర్ చెకప్స్ చేస్తూ, సౌండ్ పొల్యూషన్ చేసే వాహనదారుల భరతం పడతామని వరంగల్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ వడ్డే నరేష్ కుమార్ హెచ్చరించారు. మోటార్ వెహికిల్ యాక్ట్ కు లోబడి నడుచుకోవడంతో పాటు ,ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించి సహకరించాలని ఆయన కోరారు. నవంబర్ ఫస్ట్ నుండి ట్రాఫిక్ రూల్స్ కఠినంగా అమలు చేయబోతున్నట్లు చెప్పారు. చట్టాలు, నిబంధనలు ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసమే ఏర్పాటు చేశారని గ్రహించి, విదిగా ఆచరించాలని వరంగల్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ వడ్డే నరేష్ కుమార్ కోరారు. చట్టాలను ఉల్లంఘించి ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ, అక్టోబర్ 29: ముఖ్యమంత్రి సహాయనిధి పపేద ప్రజలకు వరం లాంటిదని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. వివిధ ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 100 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన నియోజకవర్గంలో ఈ మూడేండ్ల కాలంలో 15 కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ చెక్కులను పేదలకు పంచినంట్లు భూపాల్ రెడ్డి తెలిపారు. ఆరోగ్యం బాగాలేక ప్రైవేటు దవాఖానల్లో చికిత్స చేయించుకున్న వారికి కూడా ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నితీష్ సర్కార్ ప్రలోభాలకు తెరలేపిందన్న తేజస్వి యాదవ్!

పట్నా, అక్టోబర్ 29: బిహార్‌లో ఉప ఎన్నికలకు ముందు నితీష్ కుమార్ ప్రభుత్వం ప్రజలకు మద్యం, డబ్బులు, చీరలు పంచుతోందని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ శుక్రవారం ఆరోపించారు. ఛాత్ పూజ పేరుతో నితీష్ సర్కార్ ప్రజలను ప్రలోభాలకు లోను చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడితే ఇప్పుడు పంపకాల సమస్య ఉత్పన్నమయ్యేది కాదని అన్నారు.

ఆర్జేడీకి అనుకూలంగా ఓటింగ్ జరిగేలా అధికారులపై నితీష్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తో

రూ.70 లక్షలు చోరీ కేసు: నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు

అమరావతి, అక్టోబర్ 29నెల్లూరు జిల్లా ఆదిశంకర కాలేజి గ్రూప్స్ కి చెందిన 70 లక్షల నగదు అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. బ్యాంక్ లో జమ చెయ్యాల్సిన నగదును గత నెల 22న ఆదిశంకర కాలేజి గ్రూప్స్ అకౌంటెంట్ గంగపట్నం శ్రీహరి ఎత్తుకెళ్లాడు. దీనిపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన దర్గామిట్టా, సీసీఎస్ పోలీసులు.. – కోవూరులో ఇనమడుగు సెంటర్ వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 68 లక్షల 50 వేలు సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

అప్ అధికారంలోకి వచ్చాక ట్రేడర్స్ భద్రత మా బాధ్యత: అరవింద్ కేజ్రివాల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29 ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ పంజాబ్‌లో సైతం తన పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే పంజాబ్ ప్రజలపై హామీల వర్షం కురిపించారు. 300 యూనిట్లలోపు కరెంటు వినియోగించే వారికి విద్యుత్ బిల్లుల మాఫీ అనేది అన్నింటికంటే ప్రధానమైన హామీ. కాగా, వచ్చే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఆద్మీ పార్టీదే విజయమని కేజ్రివాల్ ధీమా వ్యక్తంచేశారు.

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పంజాబ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయని, ఆ వెంటనే మార్చి నెలలో ఫలితాలు వెల్లడవుతాయని కేజ్రివాల్ అంచనా వేశారు. ఏప్రిల్ ఒకటి తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రాష్ట్రంలోని ట్రేడర్స్ భద్రత పూర్తిగా తమ బాధ్యత అని ఆయన చెప్పారు. నేను ఈ రోజు మీకు గట్టిగా చెబుతున్నా. ట్రేడర్స్ ఎవరూ ఆందోళన చెందవద్దు. మీ భద్రత కోసం మేం ఒక కొత్త వ్యవస్థనే రూపొందిస్తాం అన్నారు.

పేర్ని నానిని మరోసారి కలిసిన నిర్మాతల బృందం

అమరావతి, అక్టోబర్ 29సినీ పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై టాలీవుడ్‌కి సంబంధించిన పలువురు ప్రముఖులు ఏపీ ప్రభుత్వంతో గత కొద్ది రోజులుగా చర్చలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఆ మధ్య కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలో మంత్రి పేర్ని నాని సినీ ప్రముఖులతో సమావేశమయ్యారు. ఆన్‌లైన్ పద్ధతిలో సినిమా టికెట్ల విక్రయాలపై టాలీవుడ్ నిర్మాతల బృందం భేటీ అయ్యింది. మచిలీపట్నంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశానికి నిర్మాత దిల్ రాజు, డీవీవీ దానయ్య, బన్నీ వాసు, సునీల్ నారంగ్, వంశీరెడ్డి, మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తాజాగా సచివాలయంలో మంత్రి పేర్ని నానితో సినీ నిర్మాతలు భేటీ అయ్యారు. సినీ రంగానికి సంబంధించిన సమస్యలు, ఆన్‌లైన్ టికెట్ విధానంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంపై దిల్‌రాజు స్పందిస్తూ.. 'ప్రభుత్వం మా నుంచి కొంత సమాచారం అడిగింది. ఆ సమాచారం ఇవ్వడానికే మంత్రిని కలిశాము' అని నిర్మాత దిల్ రాజు తెలిపారు. సమావేశంలో దిల్ రాజు, అలంకార్ ప్రసాద్.. ఇతర నిర్మాతలు పాల్గొన్నారు.

రీసెంట్‌గా ఏపీ సీఎం జగన్‌తో ప్రముఖ సినీనటుడు నాగార్జున భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిశారు. నాగార్జునతో పాటు నిర్మాతలు ప్రీతంరెడ్డి, నిరంజన్‌రెడ్డి సహా మరికొందరు సీఎంతో భేటీ అయ్యారు. ఆయనతో కలిసి మధ్యాహ్నభోజనం కూడా చేశారు.

హోంమంత్రిని కలసిన ప్రతిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు..

అమరావతి, అక్టోబర్ 29:ప్రతిపాడు వ్యవసాయశాఖ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా నూతనంగా నియమితులైన వారు హోంమంత్రి సుచరితని మర్యాదపూర్వకంగా కలిశారు. గొట్టిపాడు కి చెందిన మేడ ఉషారాణి, తుమ్మలపాలెం లకు చెందిన శ్రీ లక్ష్మి, ప్రతిపాడు బాపతు వెంకటరమణలు బ్రాడీపేట లోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో సుచరితని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి ? డైరెక్టర్లకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ దాసరి అనుమతించ రామారావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు విజయ్ కుమార్, గొట్టిపాడు మాజీ సర్పంచ్ గుంటుపల్లి బాబురావు, సాగర్ కుడి కాలువ మాజీ చైర్మన్ గుంటుపల్లి వీర భుజంగ రాయలు, మాజీ ఎంపీటీసీ మహేంద్ర, పార్టీ నాయకులు.. కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీలో కొత్తగా 481 కరోనా కేసులు

అమరావతి, అక్టోబర్ 29:ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు క్రమంగా తగ్గుతున్నాయి. గడచిన 24 గంటల్లో 39,604 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. 481 కొత్త కేసులు నమోదు అయ్యాయి. కోవిడ్ వల్ల కృష్ణా జిల్లాలో ఒకరు మృతి చెందారు. అదే సమయంలో 385 మంది బాధితులు కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 20,65,716కి చేరగా.. 20,46,512 మంది కోలుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 4,837 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు మొత్తం 14,367 మంది మృతి చెందారు.

డి.డి.యు.-జి.కె.వై. పథకం కింద 5 రాష్ట్రాల్లో సమావేశాలు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: దేశంలోని 18 ప్రధాన రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులు ఈ నెల 15నుంచి 21వ తేదీవరకూ వరుసగా పలు సమావేశాలు జరిపారు. దీన దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డి.డి.యు.-జి.కె.వై.) పథకం కింద నిర్వహించిన సి.ఎక్స్.ఒ. సమావేశాల్లో భాగంగా వారు చర్చలు జరిపారు. అస్సాం, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ వంటి ఐదు రాష్ట్రాలకు చెందిన గ్రామీణ జీవనోపాధి పథకాల అమలులో భాగంగా ఈ సి.ఎక్స్.ఒ. భేటీలను ఏర్పాటు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు పూర్తవుతున్నసందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట నిర్వహించే వేడుకల్లో భాగంగా ఈ సమావేశాలను చేపట్టారు.

భావితరాల ప్రయోజనాలకోసం కార్మిక మార్కెట్.ను మరింత బలోపతం చేసేందుకు తీసుకోవలసన చర్యలపై చర్చించేందుకు వివిధ రంగాల పారిశ్రామిక ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రతినిధులతో పాటుగా, వివిధ రంగాల నైపుణ్య మండలుల ప్రతినిధులు కూడా పాలుపంచుకున్నారు. పర్యాటక ఆతిథ్య, రిటెయిల్ రంగాలు, లాజిస్టిక్స్, దుస్తుల రంగం, రసాయనాలు-పెట్రో రసాయనాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి.),, ఐ.టి. ఆధారిత సేవలు, ఆటోమోటివ్, పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయం, ఆరోగ్య రక్షణ, నిర్మాణరంగం, ఉత్పాదక వస్తురంగం, ఉత్పాదకం వంటి వివిధ రంగాల ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాలుపంచుకున్నారు. బి.ఎం.డబ్ల్యు., హ్యూందాయ్, పార్క్ హోటల్, బార్బెక్యూ నేషన్, లీలా ప్యాలెస్, ఒబెరాయ్-ట్రైడెంట్ (ముంబై), వివాంత, వోవ్, మోమో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల మార్కెట్ యాజమాన్యాల సీనియర్ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. పలు అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించారు. భాగస్వామ్య వర్గాలన్నింటికీ అధ్యయన వేదికలుగా ఈ సి.ఎక్స్.ఒ. సమావేశాలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై వారు తమతమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యాజమాన్య సంస్థలకు, శిక్షణలోని భాగస్వాములకు మధ్య క్రమం తప్పకుండా చర్చలు నిర్వహించేందుకు ఈ సమావేశాలు ఎలా ఉపయోగపడతాయో వివరించారు.

అయితే,.. ఈ సమావేశాల్లో ఒక్కో రాష్ట్రం, ఒక్కో ప్రత్యేక రంగంపై దృష్టిని కేంద్రీకరించింది. పర్యాటక, ఆతిథ్య రంగంపై అస్సాం రాష్ట్రం దృష్టిని కేంద్రీకరించింది. రిటెయిల్, పర్యాటకం, ఆర్థిక, లాజిస్టిక్స్, దుస్తుల రంగంపైన జార్ఖండ్ రాష్ట్రం, లాజిస్టిక్స్, దుస్తుల రంగంపైన మధ్యప్రదేశ్ రాష్ట్రం, సౌందర్య సాధనాల రంగం, వెల్.నెస్ రంగ నైపుణ్య మండలి, ఆరోగ్య రక్షణ నైపుణ్య మండలి, రసాయనాలు, పెట్రో రసాయనాలు, లాజిస్టిక్స్ రంగ నైపుణ్య మండలి, ఐ.టి., ఐ.టి. ఆధారిత సేవలు., ఉత్పాదక వస్తురంగం తదితరాలపై గుజరాత్ రాష్ట్రం,.. ఆటోమోటివ్ రంగంపై తమిళనాడు రాష్ట్రం తమతమ దృష్టిని కేంద్రీకరించాయి.

డి.డి.యు.-జి.కె.వై. పథకం కింద శిక్షణలో ఉన్న అభ్యర్థుల శిక్షణ, నియామకం, నియామానంతర సహాయం, ఉద్యోగ జీవిత ప్రగతి వంటి అంశాలపై కూడా సి.ఎక్స్.ఒ. సమావేశాల్లో చర్చ జరిగింది. నైపుణ్యం కలిగిన సిబ్బందికోసం ఏర్పడే కొరతను ఎప్పటికప్పుడు తీర్చడం, నైపుణ్యం కలిగిన సిబ్బందికోసం ఏర్పడే డిమాండ్.ను నెరవేర్చడం, వేతనాల అంశం, కొన్ని రంగాల్లో మహిళల నియామకానికి ప్రాధాన్యత ఇవ్వడం తదితర కార్యకలాపాల్లో రాష్ట్రాల గ్రామీణ జీవనోపాధి పథకాలు నిర్వహించే పాత్రపై కూడా ఈ సమావేశాల్లో సుదీర్ఘంగా, విపులంగా చర్చించారు.

పారిశ్రామిక నిపుణులకు, రాష్ట్రాల గ్రామీణ జీవనోపాధి కల్పనా పథకాల ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలో,..లాజిస్టిక్స్ రంగం ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా ఎదుగుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇ-కామర్స్ వేదికలు వాణిజ్యంలో ఊపందుకోవడం, ఈ రంగంలో శిక్షణ పొందిన సిబ్బందికి ఉద్యోగావకాశాలు పెరగడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

అలాగే, పారిశ్రామికంగా నూతన అనుసంధానాలకు వేదికలుగా కూడా ఈ సి.ఎక్స్.ఒ. సమావేశాలు దోహదపడుతున్నాయి. శిక్షణా భాగస్వాములు, పరిశ్రమల ప్రతినిధుల మధ్య సంబంధాలను కల్పన ద్వారా ఈ కృషి జరుగుతోంది. అలాగే, డి.డి.యు.-జి.కె.వై. కార్యక్రమంలో శిక్షణ పొందిన అభ్యర్థులు తగిన ఉద్యోగ అవకాశాలు పొందేలా చూసేందుకు ఈ సమావేశాలు వీలు కల్పిస్తున్నాయి.

తమిళనాడులో సి.ఎక్స్.ఒ. సమావేశం దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డి.డి.యు.-జి.కె.వై.)

ప్రపంచ ప్రమాణాలతో కూడిన వేతన నిర్ణాయక వ్యవస్థ లక్ష్యంగా దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డి.డి.యు.-జి.కె.వై.) అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఉద్యోగ కల్పనతో అనుసంధానమైన ఈ నైపుణ్యాభివృద్ధి పథకాన్ని తొలుత, జాతీయ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించింది. ఆ తర్వాత జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకంగా దీన్ని రూపొందించారు. చివరకు డి.డి.యు-జి.కె.వై. పేరిట ఈ పథకాన్ని జాతీయ స్థాయిలో 2014 సెప్టెంబరు 25న ప్రారంభించారు. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిధులతో దీన్ని చేపట్టారు. ఉద్యోగ కల్పనతో అనుసంధానమైన జాతీయ నైపుణ్య శిక్షణ కార్యక్రమంగా ఆ తర్వాత దీన్ని తీర్చిదిద్దారు. ప్రస్తుతం 27 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతోంది. దేశవ్యాప్తంగా 2,369 శిక్షణా కేంద్రాల్లో 57 విభిన్న రంగాలకు చెందిన, 616 రకాల ఉద్యోగాలకోసం శిక్షణను ఈ పథకం కిందనే అందిస్తున్నారు. ఇప్పటి వరకూ డి.డి.యు.-జి.కె.వై. కింద మొత్తం 11.09లక్షల మంది అభ్యర్థులకు శిక్షణ అందించారు. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి 7.13లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి.

రైతు అనుకూల నిర్ణయాలతో పెరిగిన సాగు విస్తీర్ణం : మంత్రి వేముల

నిజామాబాద్, అక్టోబర్ 29:ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న రైతు అనుకూల నిర్ణయాల వల్ల రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని వేల్పూర్ మండలం లక్కోర గ్రామం, భీంగల్ మండలం సికింద్రాపూర్ గ్రామాల్లో రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మొత్తం 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోడౌన్లకు మంత్రి శంకుస్థాపన చేశారు.

రూ. 24 లక్షల వ్యయంతో నిర్మించిన సికింద్రాపూర్ పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు.

తరగతి గదుల నిర్మాణానికి ముందుకు వచ్చిన స్థానిక ఎంపీటిసికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అట్లాగే ఏర్గట్ల మండల కేంద్రంలో రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ..కాళేశ్వరం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా సాగు నీరు, విరివిగా నిర్మించిన చెక్ డ్యాములు, చెరువులు పూడికతీత ద్వారా గ్రౌండ్ వాటర్ పెరిగి కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న బోర్ల ద్వారా ఎకరం కూడా బీడు లేకుండా సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.

రైతులకు ఎకరానికి 10వేల పెట్టుబడి సాయం, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, ఎక్కడికక్కడ పంట కొనుగోలు లాంటి ఎన్నో రకాల రైతు ప్రయోజన కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఆహార ధాన్యం పంట దిగుబడి గతంలో కంటే ఈ ఏడు సంవత్సరాల్లో ఐదు రెట్లు పెరిగిందని చెప్పారు.

బాల్కొండ నియోజకవర్గంలోని కిసాన్ నగర్ లో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఒకే ఒక్క పాత గొడౌన్ ఉండేదన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే 11 కొత్త గొడౌన్స్ వచ్చాయన్నారు. ఇప్పటికే తొమ్మిది పూర్తయి వినియోగంలో ఉన్నవని తెలిపారు.

ఈ సందర్భంగా గోడౌన్లు మంజూరుచేసిన మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి కి మంత్రి వేముల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

విజయ గర్జన సభాస్థలిని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, అక్టోబర్ 29:: టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నవంబర్ 15న వరంగల్‌లో విజయ గర్జన సభ నిర్వహించేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. వరంగల్ నగర సమీపంలో సుమారు 10లక్షల మందితో భారీ ఎత్తున సభను నిర్వహించి, విజయవంతం చేసేందుకు శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా నగరంలోని మడికొండ శివారులోని ఖాళీ స్థలాలను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి పరిశీలించారు. టీఆర్ఎస్ విజయ గర్జన సభను 10 లక్షల మందితో భారీ ఎత్తున జనసమీకరణ చేసి సభను విజయవంతం చేయడానికి ఎలాంటి అటంకాలు కలుగకుండా అన్ని హంగులతో సభ నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ స్థాపించి 20వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ సాధించిన విజయాలను, ప్రభుత్వం సాధించిన ప్రగతిని సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులు, ప్రజలకు నివేదిస్తారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీలు.. సీఎం జగన్ కీలక ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 29:రాష్ట్రంలో 12,979 పంచాయతీల్లో వైఎస్ఆర్ విలేజ్ డిజిటల్ లైబ్రరీలు నిర్మాణం చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీకి అంతరాయం లేని బ్యాండ్ విడ్త్‌తో ఇంటర్నెట్‌ను ఇవ్వాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాని సూచించారు. ప్రతి గ్రామానికి ఇంటర్ నెట్, డిజిటల్ లైబ్రరీలపై సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నంతో పాటు తూర్పుగోదావరి జిల్లాలలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ నాలుగు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, వర్క్ ఫ్రం హోం కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామాల నుంచే పనిచేసే పరిస్థితి రావాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ లైబ్రరీల నిర్మాణాల ప్రగతిపై సీఎం జగన్‌కు అధికారులు వివరాలు అందించారు. రాష్ట్రంలో 12,979 పంచాయతీల్లో వైఎస్ఆర్ విలేజ్ డిజిటల్ లైబ్రరీలు నిర్మాణం చేపడుతున్నామని, మూడు దశల్లో విలేజ్ డిజిటల్ లైబ్రరీల నిర్మాణం చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. తొలి విడతలో చేపడుతున్న 4530 విలేజ్ డిజిటల్ లైబ్రరీల నిర్మాణ పనుల ప్రగతిపై సీఎంకు వివరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు ఉపయోగపడాలని, విలేజ్ డిజిటల్ లైబ్రరీలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వీటి నిర్వాహణపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు.

జనవరి నాటికి తొలిదశలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు తెలియజేయగా.. అదే సమయంలో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలని సీఎం అన్నారు. ప్రతి డిజిటల్ లైబ్రరీలో డెస్క్‌టాప్ కంప్యూటర్లు, సిస్టం ఛైర్లు, ప్లాస్టిక్ ఛైర్లు, ఫ్యాన్లు, ట్యూబులైట్లు, ఐరన్ రాక్స్, పుస్తకాలు, మేగజైన్‌ల ఏర్పాటు తప్పనిసరి అని తెలిపారు. మొదటి దశ డిజిటల్ లైబ్రరీలు డిసెంబరు 2022 నాటికి ఫేజ్2 పూర్తి చేసేలా కార్యాచరణ చేయాలన్నారు. జూన్ 2023 నాటికి మూడో దశ డిజిటల్ లైబ్రరీల నిర్మాణ లక్ష్యంగా నిరేశించుకోవాలని, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో అన్‌ఇంటరెప్టడ్ బ్యాండ్‌విడ్త్‌తో కూడిన ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు.

రైతుల దుస్థితిపై యూపీ సర్కార్ లక్ష్యంగా వరుణ్ గాంధీ విమర్శలు!

లక్నో, అక్టోబర్ 29:: రైతుల సమస్యలకు సంబంధించి తన పార్టీ నేతృత్వంలోని యూపీ సర్కార్‌పై బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ శుక్రవారం మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. యూపీలోని వ్యవసాయ మార్కెట్లలో అవినీతి రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. రైతుల ఇబ్బందుల గురించి ఆయన బరేలీలోని ఓ మండీలో అధికారితో మాట్లాడుతున్న వీడియోను వరుణ్ గాంధీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. దేశవ్యాప్తంగా రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్మేలా వ్యాపారులు, దళారులు కుమ్మక్కవుతున్నారని ఈ వీడియోలో వరుణ్ గాంధీ సదరు అధికారితో పేర్కొనడం కనిపించింది.

రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులను తాను సహించనని వారిని అరెస్ట్ చేసేలా కోర్టుకెక్కుతానని అధికారిని వరుణ్ గాంధీ వీడియోలో హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా తమ ఉత్పత్తులను అమ్ముకునే రైతులను అధికారులు వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఓ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించగా అక్కడ 5 కాంటాలు ఉన్నట్టు రికార్డుల్లో ఉన్నా కేవలం మూడే పనిచేస్తున్నాయని వరుణ్ గాంధీ చెప్పుకొచ్చారు. రైతు సమస్యలపై గళమెత్తుతున్న వరుణ్ గాంధీని బీజేపీ అగ్రనాయకత్వం పక్కనపెట్టినా ఆయన పలు సందర్భాల్లో అన్నదాతలకు భరోసా కల్పించేలా తన వాణి వినిపిస్తూనే ఉన్నారు.

టి-సాట్‌ను సందర్శించిన ఐఐఎస్ బృందం

హైదరాబాద్ , అక్టోబర్ 29: ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐ.ఐ.ఎస్) 2019 బ్యాచ్ కు చెందిన నలుగురు అధికారుల బృందం శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని టి-సాట్ కార్యాలయాన్ని సందర్శించింది. సీఈవో ఆర్.శైలేష్ రెడ్డిని కలిసిన బృందం టి-సాట్ నిర్వహణ గురించి తెలుసుకొని కార్యాలయంలోని స్టూడియో, పీసీఆర్, ఎర్త్ స్టేషన్ పనితీరును బృందం సభ్యులు పరిశీలించారు.

ఐఐఎస్ 2019 బ్యాచ్ కు చెందిన ఆశిష్ గోయల్, డి.బాలనాగేంద్రన్, కె.అనురాగ్ కుమార్, శ్రీ సాయి వెంపటిబృందంలో సభ్యులుగా ఉన్నారు. టి-సాట్ కార్యాలయంలో సీఈవో శైలేష్ రెడ్డితో జరిగిన ముఖాముఖిలో బృందం సభ్యులు టి-సాట్ నిర్వహణ తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సీఈవో శైలేష్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాలుగా టి-సాట్ నెట్వర్క్ ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. కేవలం ఆర్వోటీ పద్ధతిలో ప్రసారాలను అందించే టి-సాట్ నెట్వర్క్ మంత్రి కేటీఆర్ చొరవతో కేబుల్, డీటీహెచ్, శాటిలైట్ విభాగాలతో పాటు డిజిటల్ మీడియాలోనూ వివిధ రంగాలకు విస్తరించిన సేవల విధానాన్ని వివరించారు.

డిజిటల్ విద్యతో పాటు, ఆరోగ్య సలహాలు, పోటీ పరీక్షల సమాచారం, వ్యవసాయ సేద్యంలోని కొత్త మెళకువలు ఆయా రంగాలకు చేరవేయడంలో టి-సాట్ పనిచేసిన పద్ధతులను తెలియ చెప్పారు.

కమ్యూనికేషన్ వ్యవస్థ అన్ని వర్గాలకు ఎలా ఉపయోగపడుతుందో, కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ టి-సాట్ నెట్వర్క్ ఎలా పనిచేసిందో ఉదాహరణలతో వివరించారు.

2014 సంవత్సరానికి ముందు కేవలం వందల సంఖ్యలో సేవలందించిన టి-సాట్ వివిధ మార్గాల ద్వార తెలంగాణలోని సుమారు 90 శాతం మంది ప్రజలకు చేరువైందని చెప్పారు.

కరోనా సమయంలో డిజిటల్ పాఠ్యాంశాలు ఎంత మంది విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని బృందం సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగాసెప్టెంబర్ ఒకటవ తేదీన ప్రారంభమైన మొదటి రోజే సుమారు 14 లక్షల మందికి చేరుకుని ఆ సంఖ్య దిన దినం పెరుగుతూనే వచ్చిందన్నారు.

ప్రభుత్వాలకు సంబంధించిన సమాచారంతో ప్రజలకే ప్రయోజనం చేకూర్చే సమాచారాన్ని చేరవేయడంలో కమ్యూనికేషన్ రంగం పాత్ర కీలకమని, ఆ రంగాన్ని ఎంచుకున్న ఐఐఎస్ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. పి.ఐ.బి మీడియా అండ్ కమ్యూనికేషన్ అధికారి వి.గాయత్రి బృందాన్ని సమన్వయపరిచారు.

రైతులకు శుభవార్త.. మహా పాదయాత్రకి కోర్టు గ్రీన్ సిగ్నల్..

అమరావతి, అక్టోబర్ 29:ఏపీ హైకోర్టు అమరావతి రాజధాని రైతులు చేపట్టనున్న మహా పాదయాత్రకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి రాజధాని రైతులు న్యాయస్థానం టూ దేవస్థానం నినాదంతో చేపట్టదలచిన మహా పాదయాత్రకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అనుమతినిచ్చింది.రాజధాని రైతులు పాదయాత్ర చేసేందుకు అనుమతి కోసం వేసిన లంచ్ మోషన్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. కరోనా నిబంధనలు అమలులో ఉన్నాయి వాటిని ఉద్యమ నిర్వాహకులు అమలు చేయలేరని?మూడు రాజధానుల అంశం న్యాయస్థానం పరిధిలో ఉందని .. దాని మీద ఆందోళనకు అనుమతించడం వీలుకాదని చెబుతూ పోలీసులు ఈ పాదయాత్రకు అనుమతి నిరాకరించారు. ఈవిషయాన్ని ప్రభుత్వన్యాయవాది ప్రస్తావించారు.పోలీసులు అనుమతి నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో సహేతుకమైన కారణాలు లేవని వివరించిన న్యాయవాది లక్ష్మీనారాయణ వాదించారు. దీనితో పాదయాత్రకు అనుమతిస్తే అభ్యంతరం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. అయితేరైతుల పాదయాత్రపై గ్రామాల్లో రాళ్లు వేసే ప్రమాదం ఉందని. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే రైతులు శాంతియుతంగా పాదయాత్ర చేసుకుంటారని న్యాయవాది లక్ష్మీనారాయణ కోర్టుకు వెల్లడించారు. అనంతరం షరతులతో పాదయాత్రకు అనుమతినిచ్చింది.

వస్తువులు-సలహాయేతర సేవల సేకరణకు సంబంధించి నమూనా టెండర్ పత్రాలు (ఎంటీడీ) విడుదల చేసిన కేంద్ర ఆర్థిక కార్యదర్శి డా. టీవీ సోమనాథన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:గౌరవనీయులైన ప్రధానమంత్రి ఈ ఏడాది తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా- దేశంలో అమలయ్యే నియమాలు-విధానాలపై నిరంతర సమీక్ష ఆవశ్యకతను నొక్కిచెప్పిన నేపథ్యంలో ప్రభుత్వ అవసరాల కోసం వస్తువులు-సలహాయేతర సేవల కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ఆర్థిక కార్యదర్శి డా. టీవీ సోమనాథన్ ఇవాళ నమూనా టెండర్ పత్రాల (ఎంటీడీ)ను విడుదల చేశారు. ముఖ్యంగా ఇ-కొనుగోళ్ల సంబంధిత అవసరాలు తీర్చడంతోపాటు ప్రభుత్వ ఇ-కొనుగోళ్ల ప్రక్రియ అనుసరణను 'ఎంటీడీ'లు సులభం చేస్తాయి. అంతేకాకుండా ప్రజానుకూల-సమర్థ ఎలక్ట్రానిక్ పాలనను మరింత ముందుకు తీసుకెళ్లాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చడంలో తోడ్పడతాయి.

ప్రభుత్వం-పరిశ్రమల మధ్య సంబంధాలకు టెండరు పత్రాలు కీలక సంధాన ఉపకరణాలు కావడం వల్ల క్షేత్రస్థాయిలో విధాన నిర్ణయాల అమలులోనూ అవి కీలక వాహకాలుగా ప్రధాన పాత్ర పోషిస్తాయి. అదేవిధంగా ప్రభుత్వం తన విధానాలను సమర్థంగా, స్థిరంగా, ఏకరీతిన వ్యక్తీకరించడంలో ఏకరూప టెండరు పత్రాలు వెసులుబాటు కల్పిస్తాయి. ప్రభుత్వ కొనుగోళ్ల విధానాలు-చర్యలను అర్థం చేసుకోవడంలో, అనుసరించడంలో ఏకరూపత వల్ల అనువర్తనంలో స్పష్టత వస్తుంది. తద్వారా ప్రభుత్వ కొనుగోళ్ల ప్రక్రియకు కట్టుబాటుసహా ప్రజల్లో దానిపై విశ్వాసం కూడా పెరుగుతుంది. అంతేకాకుండా కొనుగోళ్లలో ఉత్తమ పద్ధతుల పరస్పర ప్రదానం సహా విధానపరమైన చర్యల సానుకూల ప్రభావాన్ని ఏకరూప టెండరు పత్రాలు మరింత పెంచుతాయి. దీంతోపాటు పోటీతత్వం పెరిగి, భారీస్థాయిలో పొదుపు సాధ్యం కావడమేగాక పన్ను చెల్లింపుదారుల సొమ్ముకు తగిన విలువను రాబట్టే సమర్థ మార్కెట్ పరిస్థితుల సృష్టికి అవి దోహదం చేస్తాయి. ఈ టెండర్లలో పాల్గొనే పోటీదారుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ సౌలభ్యం కూడా కల్పిస్తాయి.

ఈ మేరకు వస్తువులు-సలహాయేతర సేవల సేకరణ కోసం ప్రస్తుత 'నమూనా టెండరు పత్రాలు' (ఎంటీడీ) రూపొందించబడ్డాయి. టెండరు పత్రాల రూపకల్పన ప్రక్రియను 'ఎంటీడీ'లు సరళీకరించడంతోపాటు హేతుబద్ధీకరిస్తాయి. సూక్ష్మ-చిన్న పరిశ్రమలపై ప్రభుత్వ విధానాలుసహా 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రాధాన్యం, అంకుర సంస్థల ప్రయోజనాలను వివిధ ప్రభుత్వ కొనుగోళ్ల నిబంధనలతో సమన్వయం చేస్తాయి. అలాగే జాతీయంగా, అంతర్జాతీయంగా అత్యుత్తమ పద్ధతులను 'ఎంటీడీ'లు అమలులోకి తెస్తాయి. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలు, ఇతర సంస్థలు, వ్యక్తిగత నిపుణులతో రెండు దశలలో విస్తృత సంప్రదింపుల అనంతరం 'ఎంటీడీ'లు రూపుదిద్దుకున్నాయి.

ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని వ్యయాల విభాగం (డీఓఈ) జారీచేసిన ఈ 'ఎంటీడీ'లు మార్గదర్శక పత్రాలుగా ఉపయోగపడతాయి. 'డిజిటల్ ఇండియా' కార్యక్రమానికి ప్రభుత్వ ప్రాధాన్యం ప్రాతిపదికగా సులభ అనుసరణ నమూనాలుగా రూపొందించిన ఈ 'ఎంటీడీ'లు సంబంధిత శాఖల్లో వినియోగానికి ఎంతో సౌలభ్యంగా ఉంటాయి. ఆ మేరకు మంత్రిత్వశాఖలు, విభాగాలు ఈ పత్రాలను తమ స్థానిక/ప్రత్యేక అవసరాలకు తగినట్లు మార్పుచేర్పులు చేసుకోవచ్చు. మరోవైపు కొనుగోళ్ల కోసం ప్రతి 'ఎంటీడీ'ని వాడుకునే విధానంపై మార్గనిర్దేశం చేసే ఒక ప్రత్యేక సమగ్ర కరదీపిక కూడా సిద్ధం చేయబడింది. మొత్తంమీద ఆర్థికశాఖలోని వ్యయాల విభాగం జారీచేసిన 'ఎంటీడీ'లు మార్గదర్శక నమూనాలుగా ఉంటాయి.

ప్రభుత్వ సంస్థలు తమ విధులు-బాధ్యతల నిర్వహణలో భాగంగా వివిధ వస్తువులు-సలహాయేతర సేవల కొనుగోళ్లు చేస్తుంటాయి. ఈ క్రమంలో సుపరిపాలన, పారదర్శకత, నిష్పాక్షికత, పోటీతత్వం, ప్రభుత్వ కొనుగోళ్లలో ప్రజాధనానికిగల విలువ పెంపు దిశగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో అనేక కీలక విధాన చర్యలు చేపట్టింది. తదనుగుణంగా 2017 మార్చిలో సమగ్ర సమీక్ష తర్వాత 'సార్వజనీన ఆర్థిక నిబంధనల'ను జారీచేసింది. ఇందులో భాగంగా 'వస్తు కొనుగోళ్ల నిబంధనావళి-2017', 'సంప్రదింపు-సలహాయేతర సేవల కొనుగోళ్లు-2017', 'నిర్మాణ-నిర్వహణ కొనుగోళ్లు-2019' పేరిట మూడు కొనుగోళ్ల కరదీపికలను కూడా రూపొందించింది. దేశంలో అమలయ్యే నియమాలు-విధానాలపై నిరంతర సమీక్షకు అనుగుణంగా రూపొందించి, జారీచేసిన ఈ నమూనా టెండరు పత్రాల అనుసరణకు సంబంధించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర మంత్రిమండలి కార్యదర్శి 2021 అక్టోబరు 2 నుంచి 2021 అక్టోబరు 31 మధ్య పర్యవేక్షిస్తారు.

పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ , ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ లో సంస్కరణల దిశగా మార్గదర్శకాలను విడుదల చేసిన కేంద్ర ఆర్థిక కార్యదర్శి డా॥ టీవీ సోమనాథన్.

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:కేంద్ర ఆర్థిక కార్యదర్శి ఉ వ్యయ కార్యదర్శి డా. టీవీ సోమనాథన్ ఈరోజు జరిగిన వర్చువల్ ఈవెంట్‌లో పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో సంస్కరణలను తీసుకురావడానికి మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా గౌరవనీయులైన ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రస్తుత నియమాలు మరియు విధానాలను నిరంతరం సమీక్షించే ప్రక్రియలో భాగంగా మార్గదర్శకాలను రూపొందించడం, విడుదల చేయడం జరిగింది. ఇది 2 అక్టోబర్ 2021 నుండి 31 అక్టోబర్ 2021 వరకు ప్రత్యేక ప్రచారం సందర్భంగా క్యాబినెట్ సెక్రటరీ పర్యవేక్షణ చేస్తారు.

పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లోని వివిధ రంగాలకు చెందిన నిపుణులతో కూడిన వివరణాత్మక సంప్రదింపు ప్రక్రియ తర్వాత సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఆధ్వర్యంలో మార్గదర్శకాల ముసాయిదా తయారు చేయడం జరిగింది. మంత్రిత్వ శాఖలు/డిపార్ట్‌మెంట్ల వ్యాఖ్యలను అభ్యర్థించి, వివరణాత్మకంగా పరిశీలించిన తర్వాత మార్గదర్శకాలను జారీ చేయడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఖర్చుల విభాగం (డిఓఈ) నామినేట్ అయింది.

ఈ మార్గదర్శకాలు భారతదేశంలో పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ రంగంలోకి చేర్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రాజెక్ట్‌ల వేగవంతమైన, సమర్థవంతమైన మరియు పారదర్శక అమలు కోసం వినూత్న నియమాలు రూపొందాయి. ప్రజా ప్రయోజనాల కోసం త్వరితగతిన మరియు మరింత సమర్థవంతమైన నిర్ణయం తీసుకోవడానికి కార్యనిర్వాహక సంస్థలను శక్తివంతం చేస్తాయి. కొన్ని మెరుగుదలలు గడువులోగా చెల్లింపుల కోసం ఖచ్చితమైన టైమ్‌లైన్‌లను నిర్దేశించడం కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్‌లతో ప్రత్యేకించి మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) లిక్విడిటీని మెరుగుపరచడానికి తాత్కాలిక చెల్లింపులను సకాలంలో విడుదల చేయడం (70% లేదా అంతకంటే ఎక్కువ బిల్లులు) అంచనా వేయబడింది.

ప్రభుత్వ డిజిటల్ ఆలోచనల్లో భాగంగా, పనుల పురోగతిని రికార్డ్ చేయడానికి ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ పుస్తకాలను సిఫార్సు చేసారు. ఈ వ్యవస్థ, మార్గదర్శకాలలో ప్రతిపాదించబడిన ఇతర ఐటీ ఆధారిత పరిష్కారాలతో పాటు, సమర్థవంతమైన డిజిటల్ ఇండియా కలను సాకారం చేయడంలో, కాంట్రాక్టర్లకు వేగవంతమైన చెల్లింపులను సులభతరం చేయడంలో మరియు వివాదాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

కాంట్రాక్టర్ల ఎంపిక కోసం ప్రత్యామ్నాయ పద్ధతులను అనుమతించారు, ఇవి ప్రాజెక్ట్‌ల అమలులో వేగం, సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. సముచితమైన సందర్భాలలో, సాంప్రదాయ ఎల్1 సిస్టమ్‌కు ప్రత్యామ్నాయంగా, నాణ్యత ఖర్చు ఆధారిత ఎంపిక (క్యూసిబిఎస్) ద్వారా ప్రతిపాదనను పారదర్శకంగా మరియు న్యాయమైన పద్ధతిలో మూల్యాంకనం చేసేటప్పుడు నాణ్యతా పారామితులకు వెయిటేజీ ఇవ్వవచ్చు. పబ్లిక్ ప్రాజెక్ట్‌లను సకాలంలో, ఆమోదించిన ఖర్చులో, మంచి నాణ్యతతో అమలు చేయడం ఎల్లప్పుడూ సవాలుగా ఉంది.

ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకున్నందున, అనవసరమైన అడ్డంకులు తొలగుతాయని, పన్నుచెల్లింపుదారుల డబ్బును పెంచడానికి కొత్త ఆవిష్కరణలు ఉపయోగించబడుతున్నాయని నిర్ధారించడానికి విధానాలు, నియమాలను జాగ్రత్తగా పరిశీలించడం చాలా అవసరం. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి), కంప్ట్రోలర్ ఉ ఆడిటర్ జనరల్ (కాగ్), నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (నీతి) ఆయోగ్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కోసం విధానాలు, మరియు నియమాలపై వివరణాత్మక విశ్లేషణను నిర్వహించాయి మరియు ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవటానికి వ్యూహాలలో మార్పులను సూచించాయి.

పబ్లిక్ ప్రాజెక్ట్‌లను సకాలంలో, ఆమోదించబడిన ఖర్చులో మరియు మంచి నాణ్యతతో అమలు చేయడం ఎల్లప్పుడూ సవాలుగా ఉంది. ఆర్థిక అభివృద్ధి వేగం పుంజుకున్నందున, అనవసరమైన రోడ్‌బ్లాక్‌లు తొలగించబడతాయని మరియు పన్ను చెల్లింపుదారుల డబ్బు విలువను పెంచడానికి కొత్త ఆవిష్కరణలు ఉపయోగించబడుతున్నాయని నిర్ధారించడానికి విధానాలు మరియు నియమాలను జాగ్రత్తగా పరిశీలించడం చాలా అవసరం.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ), కంప్ట్రోలర్ ఉ ఆడిటర్ జనరల్ (కాగ్), నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (నీతి) ఆయోగ్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ మరియు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కోసం విధానాలు మరియు నియమాలను సవివరంగా విశ్లేషించి, వ్యూహాలలో మార్పులను సూచించాయి. ప్రస్తుత మరియు భవిష్యత్ ప్రజా సేకరణ సవాళ్లను ఎదుర్కోవాలి.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL- CUM XXVII ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS: AT: SECUNDERABAD.

M.V.O.P.NO. 606 OF 2019

Between:

Yusuf Bee & another

...Petitioners

AND

Bandari Shravan Kumar & others

...Respondents

NOTICE

To

1.Chetcoori Padma
W/o. Late Laxmi Narayana
MU,Aged: Major, Occ: Owner of Crime Vehicle bearing No: TS-09-EN-0952,
R/o. H. No: 1-2-342/6/A,
Phoolbaagh,Domalguda,
Hyderabad – 500 004

Please take notice that the above named petitioners have filed a case for compensation under M.V. Act, and the same was posted on 01.12.2021, at 10.30.A.M. for your appearance and counter if any. If you fail to appear on that the day either in person or through an Advocate, otherwise the matter will be decided on merits.

(BY ORDER OF THE COURT)

M/S. T.RAJU,
K.N.V.Ramani,
T. Rahul
K.Adinarayana
ADVOCATES,
Plot No.15,
Lakshmi Nagar Colony,
Secunderabad.

యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూఐపీ) కింద న్యుమోకాకల్ కంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) దేశవ్యాప్త పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూఐపీ) కింద న్యుమోకాకల్ కంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) దేశవ్యాప్త విస్తరణ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా శుక్రవారం ప్రారంభించారు. పిసివిపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కమ్యూనికేషన్ అవగాహన ప్యాకేజీలను కూడా విడుదల చేశారు. ఈ కమ్యూనికేషన్ ప్యాకేజీలను తదుపరి వినియోగం కోసం అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపిస్తారు.

దేశవ్యాప్త పంపిణీ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ, సార్వత్రిక ఉపయోగం కోసం పిసివిని అందుబాటులోకి రావడం దేశంలోనే మొదటిసారి అని అన్నారు. ఇండియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాలు, అంతకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలకు న్యుమోనియా ప్రధాన కారణమని ఆయన తెలిపారు. "పిల్లలలో తీవ్రమైన న్యుమోనియాకు న్యుమోకాకస్ వల్ల కలిగే న్యుమోనియా చాలా సాధారణ కారణం. భారతదేశంలో దాదాపు 16 శాతం మంది చిన్నారుల మరణాలు న్యుమోనియా కారణంగానే సంభవిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పిసివి ఇవ్వడం వల్ల శిశు మరణాలు 60 శాతం తగ్గుతాయి'' అని ఆరోగ్య మంత్రి పేర్కొన్నారు.

ప్రతిదేశ వృద్ధి, ఉత్పాదకత అభివృద్ధిలో ఆరోగ్యవంతమైన పిల్లల పాత్ర ఎంతో కీలకమన్న కేంద్ర మంత్రి, పిల్లలే మన దేశ భవిష్యత్తు అని, వారికి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడం మన బాధ్యత అని అన్నారు. ప్రధాన మంత్రి ప్రారంభించిన మిషన్ ఇంద్రధనుష్ ఇందుకోసం చేపట్టిన ప్రయత్నాలలో ఒకటని వివరించారు. "కోవిడ్ 19 వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్ కోసం ప్రధాన మంత్రి చొరవ వల్ల అమల్లోకి వచ్చిన "సబ్కో వ్యాక్సిన్, ముఫ్త్ వ్యాక్సిన్" కార్యక్రమం అర్హులైన జనాభా దేశవ్యాప్తంగా కొవిడ్ 19 వ్యాక్సిన్‌లను పొందేలా చేసింది

పిసివి ప్రారంభించడం వల్ల పిల్లల మరణాలను తగ్గించడమే కాకుండా వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదల అభివృద్ధికి మరింత భరోసా ఇవ్వగలుగుతాం"అని ఆయన అన్నారు.

ఈ ప్రాణరక్షక వ్యాక్సిన్‌ను విడుదల చేయడంలో కృషి చేసినందుకు ఇమ్యునైజేషన్ సిబ్బందిని, ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలను, అధికారులందరినీ కేంద్ర ఆరోగ్య మంత్రి అభినందించారు. వ్యాక్సిన్‌కు సంబంధించిన కమ్యూనికేషన్ ప్యాకేజీని విడుదల చేస్తూ, టీకాపై అవగాహన కల్పించడం కీలకమని డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఉద్ఘోషించారు. వ్యాక్సిన్ లక్ష్యం మన పిల్లల ప్రాణాలను కాపాడటమేనని, దేశవ్యాప్తంగా విజయవంతంగా అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తేనే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

యూఐపీ గురించి:

యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూఐపీ) ఏటా 2.67 కోట్ల మంది నవజాత శిశువులు, 2.9 కోట్ల మంది గర్భిణుల కోసం నిర్వహిస్తున్న అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాలలో ఒకటి.

యూఐపీ కింద, 12 నివారించగల వ్యాధులకు వ్యతిరేకంగా వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిస్తున్నారు.

జాతీయస్థాయిలో 10 వ్యాధులు.. - డిప్తీరియా, పెర్టుసిస్, ధనుర్వాతం, పోలియో, తట్టు, రుబెల్లా, బాల్యంలో క్షయ, రోటావైరస్ డయేరియా, హెపటైటిస్ బి హేమోఫిలస్ ఇన్ఫ్లుఎంజా రకం బి వల్ల వచ్చే మెనింజైటిస్ ఉ న్యుమోనియాలకూ టీకాలు ఇస్తున్నారు.

ఉప-జాతీయస్థాయిలో 2 వ్యాధుల నివారణకు - న్యుమోకాకల్ న్యుమోనియా జపనీస్ ఎన్సెఫాలిటిస్ టీకాలు ఇస్తారు; వీటిలో న్యుమోకాకల్ కంజుగేట్ వ్యాక్సిన్ నేడు జాతీయస్థాయిలో పంపిణీ అవుతోంది. అయితే జేతః వ్యాక్సిన్ స్థానిక జిల్లాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది.

మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్, అదనపు కార్యదర్శి వికాస్ షీల్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ అశోక్ బాబుతో పాటు ఆరోగ్య మంత్రిత్వ శాఖ రాష్ట్రాల సీనియర్ అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు వేలిముద్రల బ్యూరో డైరెక్టర్ల 22 వ జాతీయ సమావేశాన్ని ప్రారంభించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ కుమార్ మిశ్రా

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:రెండు రోజుల పాటు జరగనున్న వేలిముద్రల బ్యూరో డైరెక్టర్ల 22 వ జాతీయ సమావేశాన్ని ఢిల్లీలో ఈ రోజు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ కుమార్ మిశ్రా ఆన్ లైన్ లో ప్రారంభించారు.

ప్రారంభ సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ వి.ఎస్.కె. కౌముది నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డైరెక్టర్ శ్రీ రామ్ ఫల్ పవార్, వివిధ రాష్ట్రాలకు చెందిన సీనియర్ పోలీసు అధికారులు, శాస్త్రవేత్తలు, వేలిముద్రల రంగంతో సంబంధం ఉన్న నిపుణులు పాల్గొన్నారు. నేర పరిశోధనలో వేలిముద్రల శాస్త్ర వినియోగంపై రూపొందిన 24 వ వార్షిక సంచిక ఫింగర్ ప్రింట్ ఇన్ ఇండియా -2020 ను కేంద్ర మంత్రి విడుదల చేశారు. నేర పరిశోధనలో ఐటీ వినియోగం కోసం నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అమలు చేస్తున్న చర్యలను మంత్రి ప్రశంసించారు.

నవంబర్ 5న కేదార్‌నాథ్‌ని దర్శించి, శ్రీ ఆదిశంకరాచార్యుల సమాధిని ఆవిష్కరించనున్న ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:నవంబర్ 5వ తేదీన ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌ను దర్శించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.

కేదార్‌నాథ్ ఆలయంలో ప్రధాన మంత్రి పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆయన శ్రీ ఆదిశంకరాచార్య సమాధిని, శ్రీ ఆది శంకరాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సమాధిని 2013లో సంభవించిన వరదల అనంతరం పునర్నిర్మించారు. మొత్తం నిర్మాణ పని ప్రధానమంత్రి మార్గదర్శనంలో చేపట్టారు. ప్రాజెక్టు పురోగతిని ఆయన నిరంతరం సమీక్షిస్తూ, పర్యవేక్షించారు.

దీనితో పాటుగా ప్రధానమంత్రి సరస్వతి ఆస్థపథ్ నిర్మాణ పనులను, పూర్తి చేసిన పనులను ప్రధానమంత్రి సమీక్షించి, తనిఖీ చేయనున్నారు.

అనంతరం ప్రధానమంత్రి బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సరస్వతీ అడ్డుగోడ (రిటైనింగ్ వాల్) ఆస్థపథ్, ఘాట్లు, మందాకినీ అడ్డుగోడ ఆస్థపథ్, తీర్థ్ పురోహిత్ గృహం, మందాకినీ నదిపై గురడ చట్టి వంతెన సహా వలు కీలక మౌలికసదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టులను రూ. 130 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు. సంగం ఘాట్ పునర్ అభివృద్ధి, ఫస్ట్ ఎయిడ్, టూరిస్ట్ ఫెసిలిటేషన్ సెంటర్, పాలనా కార్యాలయం, ఆసుపత్రి, రెండు గెస్టు హౌజులు, పోలీస్ స్టేషన్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, మందాకినీ ఆస్థపథ్ క్యూ నిర్వహణ, వర్షం నుంచి తలదాచుకునేందుకు శిబిరం, సరస్వతీ పౌర సౌకర్య భవనం, ఘాట్లు సహా దాదాపు రూ. 180 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులకు ఆయన పునాది రాయి వేయనున్నారు.

రజనీకాంత్ ఆరోగ్యంపై హెల్త్ బులిటెన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:స్వల్ప అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆరోగ్యంపై అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ ఆరోగ్యంపై చెన్నైలోని కావేరి ఆస్పత్రి శుక్రవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని పేర్కొన్నారు. రజనీకాంత్ మెదడు రక్తనాళాల్లో బ్లాక్స్ గుర్తించినట్టు తెలిపారు. ఆ బ్లాక్స్‌ని తొలగిస్తున్నట్టు వెల్లడించారు. త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు.

అందుకే కొత్త పార్టీలు: తెలంగాణ రాజకీయాలపై ఏపీ మంత్రి ఆసక్తికర వ్యాఖ్య

హైదరాబాద్ , అక్టోబర్ 29:తెలంగాణ రాజకీయాలపై ఏపీ మంత్రి పేర్ని నాని మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై ఏపీ మంత్రి పేర్ని నాని తనదైన శైలిలో సెటైర్లు వేశారు. తెలంగాణలో రాజకీయ శూన్యత వల్లే కొత్త పార్టీలు పుట్టుకు వస్తున్నాయని మంత్రి పేర్ని నాని అన్నారు. అందుకే ఓ ఐపీఎస్ రాజీనామా చేసి మరీ పార్టీ పెట్టారని.. మరికొన్ని పార్టీలు కూడా వచ్చాయని అభిప్రాయపడ్డారు. ఏపీలో 151 స్థానాలు వచ్చిన తర్వాత శూన్యత ఎక్కడుందని? ఆయన ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల గుండెల్లో ఎక్కడా శూన్యత లేదన్నారు. నదీ జలాల వినియోగం విషయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ మాట తప్పారని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. డిండి-పాలమూరు ప్రాజెక్టుల్లో తాగునీరు పేరుతో సాగుకు మళ్లించారని ఆరోపించారు. ఏపీకి కేటాయించిన నీటిలో అదనంగా చెంచాడు నీళ్లు కూడా వినియోగించబోమని ఎప్పుడో చెప్పామని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య సఖ్యత విషయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ ఎంతదూరమో.. విజయవాడ నుంచి హైదరాబాద్ అంతే దూరమని గమనించాలని మంత్రి పేర్ని నాని సూచించారు.

ప్రతిరోజూ రాజకీయాల్లో ఉండాలనుకునేవారు అలాగే మాట్లాడతారని టీ.పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సెటైర్ వేశారు. రేవంత్‌కు రోజూ రాజకీయాలు కావాలి కాబట్టి ఏదేదో మాట్లాడతారని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు.

కాగా, ఆంధ్రప్రదేశ్‌లోనూ పార్టీ పెట్టాలని కోరుతున్నారని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఏపీ మంత్రి పేర్నినాని గురువారం కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. "ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ సీఎం కేసీఆర్ పార్టీ పెట్టాలని మేమూ కోరుకుంటున్నాం. రెండు రాష్ట్రాలు కలిసిపోతే ఆయన భేషుగ్గా పోటీ చేయొచ్చు. ఏపీ, తెలంగాణ ఒకటే రాష్ట్రంగా ఉండాలని సీఎం జగన్ గతంలోనే కోరుకున్నారు. రెండు రాష్ట్రాలు కలిపేస్తే మంచిదే కదా" అని పేర్ని నాని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

3.08 కోట్ల రోడ్డు పనులకు భూమి పూజ!

-గ్రామీణ లింకు రోడ్లకు ప్రాధాన్యం!
-శాసనసభ్యులు చెన్నమనేని రమేష్.

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): శాసనసభ్యులు రమేష్ శాత్రాజుపల్లిలో పీ.ఎం.జీ.ఎస్.వై ద్వారా మంజూరైన 3.08 కోట్ల విలువతో సాత్రాజుపల్లి నుండి ఎదురుగట్ల మీదుగా నాగాయపల్లి 7 కి.మీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ రమేష్ మాట్లాడుతూ రూ.5 కోట్లతో సాయి రక్ష దాబా నుండి ఫాజుల నగర్ వరకు రోడ్ నిర్మాణం పూర్తయ్యి ఉపయోగంలోకి వచ్చిందని, దీనితో పాటు శాత్రాజుపల్లి నుండి నమిలిగుండు పల్లి రోడ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 150 కోట్లతో పీ.ఆర్ మరియు ఆర్ అండ్ బీ శాఖల ద్వారా ప్రధానమైన రోడ్లు, బ్రిడ్జీలు నిర్మించామని మరో 150 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఆమోదానికి ఉన్నాయనారు. యింకా కొన్ని గ్రామాల్లో మిగిలి ఉన్న గడప గడపకు సీసీ రోడ్లతో పాటు, గ్రామాల మధ్య లింకు రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ద్వారా నిధుల మంజూరీకి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , మున్సిపల్ చైర్మన్ మాధవి రాజు, కౌన్సిలర్లు జయ సలీం,సంగ హనుమవ్వ,స్వామి విజయ్, గోలి మహేష్, ఎఎంసి చైర్మన్ గడ్డం హనుమాండ్లు, రూరల్ జె.డ్.పీ.టీసీ యాస వాణి, పాక్స్ చైర్మన్ తిరుపతి రెడ్డి, పార్టీ నాయకులు మనోహర్ రెడ్డి, ,పట్టణ పార్టీ అధ్యక్షులు పుల్కమ్ రాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎం.పీ. టీ.నీలు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే చెన్నమనేని!

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ పరిధిలోని శాత్రాజుపల్లిలోని ప్రైమరీ , హై స్కూల్ పాఠశాలలను శుక్రవారం ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబుసందర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ పాఠశాలక కీలకమైన డ్యూయల్ డెస్క్ బెంచీలు, క్రీడా సామాగ్రి, సైన్స్ పరికరాలు, త్రాగునీటి సదుపాయం, టాయిలెట్స్ నిర్మాణం, అదనపు గదులు, ఇతరాలు నియోజకవర్గంలో అన్ని పాఠశాలలకు సమకూరుస్తామని అన్నారు.

ఈ సంవత్సరం లో దాదాపు 2కోట్ల రూపాయలు సీడీపీ నిధులు మరియు సేవ్స్